మరమేకులు, చీరమడతలు

ఏ రకమైన ఉద్రేకమూ కనబర్చకుండా అప్రియమైన వార్తచెప్పే గుండె నిబ్బరం గలవారు కొద్దిమందే ఉంటారు. ఆ కొద్ది మందిలో గంగాధరంవొకడు. మధ్యాహ్నం రెండు దాటింది. టేబిల్ మీద బెల్ నొక్కాడు. నౌకర్ కోటయ్యని వెళ్ళి మాధవిని తీసుకురమ్మన్నాడు. పదినిమిషాల్లో మాధవివొచ్చి బల్లముందు నిలబడింది అది పెద్ద బల్ల. దానిమీద వ్రాత పరికరాలు, నియాన్ బల్బ్‌లైట్, బ్లాటర్, కాలెండర్, బెల్, చుట్టలసంచి, అగ్గిపెట్టె, అవీ వున్నాయి. పక్కన వాష్‌బేసిన్, సోప్, టవెల్, గుండ్రటి అద్దం....ముందు నాలుగైదు రెక్సిన్ తొడుగు కుర్చీలు, వాటి వెనక సోఫా సూట్, మధ్యన బొమ్మలు అతికించిన స్క్రీన్, గోడని, అమ్మకాల వయనం చూపే, గ్రాఫ్ చిత్రాలు—

ఆ గదిని ఇదే రెండోమారు చూడటం మాధవి. పది నెలల క్రితం ఉద్యోగం ఇచ్చిన రోజున చూసింది. మళ్ళా ఇదే చూడటం. మొదటిసారి, ఆమె గదిలో వొస్తువుల్ని సరిగ్గా చూడలేదు. కంపెని యజమాని గంగాధరంగార్ని కూడా ఆమె ఎప్పుడూ, పరీక్షగా చూడలేదు. ఎత్తునుదురు, ఎగదువ్విన క్రాపింగ్....ఎన్నో వెండ్రుకలు లేవు—కాస్తంత భీకరంగా అగుపడే మీసం, చుట్టకీ, తాంబూలానికీ డాగుపడ్డ వంకర పళ్ళ వరస, గుండ్రటి చెక్కిళ్ళు, గడ్డం, పాతబడ్డ రాగి చెంబు రంగు—మాసిన ఖద్దరు కోటు—అదీ గంగాధరంగారి వైఖరి. ఇదివరలో ఆమెని ఎప్పుడూ పిలువలేదు, గంగాధరంగారు, ఎందుకోనని ఆశ్చర్యపడుతూ, ఆతృత కనబరుస్తూ చేతి గుప్పెట్లు బిగించి ప్రశ్నార్థకంగా చూసింది.

వ్రాత విలిపి ఆమెకేసి చూసి

"ఇంక నువ్వు రేపటి నుంచి పనిలోకి రానక్కర్లేదు" అన్నాడు గంగాధరం.

మాధవి మొహం ఎఱ్ఱబడింది-రక్తం చిందరవందరగా కదిలి కాటోలు, రెండుమూడు రంగుల ఛాయలు ఆమె బుగ్గల మీద కదుల్తు

న్నాయి. పైన పంకా తిరుగుతున్నా, చెమట బిందువులు నుదిటిమీదికి తోసుకొస్తున్నాయి. తటపటాయించింది.

"ఎందుకండీ?" అనగలిగింది. తన కంఠం బొంగురుపోయి తనకే వింతగా తోచింది.

"ఎందుకో నీకే తెలుసు."

అని గంగాధరం బెల్ నొక్కాడు. నౌకర్ కోటయ్య రాగానే.

"ఈమెని కాషియర్ దగ్గరకు తీసుకు వెళ్ళి, ఇవ్వాళ వరకూ రావాల్సింది లెక్కచూసి ఈమెకు ఇచ్చి పంపమను" అని, బల్లమీద కాగితాలు చూసుకుంటున్నాడు. మాధవికి ఏమనాలో, ఏం చెయ్యాలో తెల్సిందికాదు ఏడుపును ఆపుకోగల నిబ్బరం తెచ్చుకుంది ఎలానో, ఆవేదన సూచించే ధ్వనులొస్తున్నాయి, ఆమె కంఠం నుండి.

"మధ్యాహ్నం రెండు దాటాక అవుతే, ఇవాళ జీతం కూడా పూర్తిగా ముడుతుంది. అందుకే ఇప్పుడు పిలిపించా" అన్నాడు. ఏమనాలో తెలియదు మాధవికి. మళ్ళా ఆ ప్రశ్నే- "—ఎందుకండి"—అని అడుగుదామనుకుంది క్షణం క్రితం తెచ్చుకున్న గుండె నిబ్బరం ఇప్పుడు సడలిపోయింది. ప్రశ్నలెందుకు? "నమస్కారం" అని గదిలోంచి వెళ్ళిపోయింది మాధవి. ఆమె గది దాటాక ఆయన ఏ విధమైన వీడ్కోలు మాటన్నాడో ఆమెకి వినబడలేదు.

ఆనాటివరకూ రావల్సిన డబ్బు తీసుకుని, రోడ్డు మీదికొచ్చింది. రిక్షాలు కనబడ్డంలేదు. జట్కాబండి మాటాడుకుని, తన గదికి చేరుకుంది. తొందరంగా చెవి తాళంలోకి పోనిచ్చి తిప్పింది. రావడం లేదు. మళ్ళా మళ్ళా తిప్పింది. రావడం లేదు. ఈ చెవికాదు. మరొకటి. ఏదీ, కనబడదేం? ఆఫీసులో డ్రాయర్‌లో దిగవిడచి వుండాలి. ఈ చెవి, ఆఫీసు డ్రాయర్‌ది కాబోలు. రెండూ వొకరకం తాళాలే. మళ్ళా తిప్పింది. రావడంలేదు. బండివాణ్ని పిల్చి, తాళం చూడమంది వాడు మేకుతో కొట్టి ఇట్టే తీసేశాడు. తలుపులు మూయ్యకుండానే, హాలు వెనుక గదిలో మంచం మీద వాలిపోయి, దిండులో మొహం దాచుకుని ఏడవడం సాగించింది మాధవి.

ఎవరో ముందు గదిలో మెదిలినట్లయింది. రంజిత్ ఏమో అను

కుంది. ఓదార్చడానికి వచ్చాడా? లేచి చూసింది. ఎవ్వరూ లేరు. టీ పెట్టు కుంది. దానికి కారణం రంజిత్ అనిపిస్తుంది. రంజిత్ గంగాధరంగారి చెల్లెలి కొడుకు బి.ఏ. ఫేలయ్యాడు తన కంపెనీలోనే ఉద్యోగమిచ్చాడు మేనల్లుడికి మళ్ళా గంగాధరం అంత మంచివాడు లేడని చెప్పుకుంటారు. నిప్పులాంటి వాడుట. శీలం గలవాడుట. ఏ పనివాడూ, నిముషం ఆలస్యముగా రావడానికి లేదు. నిమిషం ముందుగా వెళ్ళడానికి వీల్లేదు. డబ్బు విషయంలో నిక్కచ్చిగలవాడు. ఏ మాత్రం తప్పిదం జరిగినా, ఉద్యోగం లోంచి తీసెయ్యడమే. తన అన్న హరికృష్ణని, తీసేశాడు. రెండుమూడొందల లెక్కల కాగితాలు తారుమారైనాయి. ముందు సర్దుకోవచ్చునను కొని అన్న కక్కుర్తిపడ్డాడు. గంగాధరంకి తెలిసింది నేరం వొప్పేసుకుని, డబ్బు కొద్దిరోజుల్లో సర్దుబాటు చేస్తానన్నాడు అన్న. ఆయన ఒప్పుగోలేదు. అన్న మతిపోయింది. శ్రీనగర్‌కి వెళ్ళిపొయ్యాడు. శాలువాలు, తివాసీలు తయారీకి నమూనాలు, డిజైన్లు వేసిస్తాడు. నాలుగైదేళ్ళ క్రితం గోదావరి వరదల్లో, తమ ఇల్లుకూలి, సర్వమూ గంగపాలైనప్పటి నుండీ అందరి మతులూ పోయినాయి. నగలు డబ్బు అన్నీ గంగపాలే. అమ్మా, నాన్నా, ఏనాడో వెళ్ళిపొయ్యారు తను, అన్న, పినతల్లీ, ఆమె కొడుకూ మిగిలారు. ఫిఫ్త్‌ఫారమ్ చదువు నిల్చిపోయింది. ఉద్యోగం చూసుకోమన్నారు టైపు నేర్చుకోమన్నారు. ఆరుమాసాలు అభ్యాసమయ్యాక, ఎలాగో పరీక్ష ప్యాసైంది. ఏడాది జరిగిన యత్నాలు ఫలించి, పదినెల్ల క్రితం గంగాధరంగారి కంపెనీలో ఉద్యోగం దొరికింది. తను చేరిన రెండు నెలలకే, అన్న ఉద్యోగం వూడింది. ఇప్పుడు తనది.

దీనికి కారణం నీకే తెలుసునన్నాడు గంగాధరం, కారణం, అతని మేనల్లుడు రంజిత్. తనంటె ఎంతో ఇష్టం. రోజూ పలకరిస్తాడు. షేక్‌హాండ్ ఇవ్వడం, ఆధునిక పద్ధతంటూ చెయ్యి నలుపుతాడు, కాస్త గట్టిగా నొక్కడంతో, మొన్నగాజు పటుక్కుమంది. వారం, వారం తనకేదో కానిస్తూ వుంటాడు—ఫ్లాస్క్, హాండ్‌బాగ్, లోషన్‌బుడ్లు, జేబురుమాళ్ళు—ఇట్లాంటివి. ఉత్తరాలు వ్రాయమని చంపుకు తింటాడు ఒకే ఆఫీసులో పనిచేస్తూ, రోజూ కనబడేవారికి ఉత్తరాల అవసరం ఏముంటుంది; ఇంగ్లీషు నవల్స్

ఇచ్చి చదవమంటాడు. తనకి ఇంగ్లీషు అంత బాగారాదు. పుస్తకాలు చదివి ఆనందించగల శక్తి లేదని అతనికి తెలియదు అదేదో "మేరీ కోరెల్లి" వ్రాసిన వొక నవల తెచ్చి ఇచ్చాడు. ఫలానా చోట సాయంత్రం ఏడింటికి కలవమన్నాడు. తనకాధైర్యంలేదు, ఉత్తరాలల్లోగాని పెండ్లిప్రస్తావనలేదు. అతన్ని పెండ్లిచేసుకోవడం, ఆమెకి ఇష్టమే జవాబు వ్రాయకపోతే చచ్చిపోతానన్నాడు. జాలేసింది వ్రాసింది. నాలుగువాక్యాలు, ఇంకెప్పుడూ, ఇట్లాంటివి వ్రాయవద్దని పాఠశాలలో చదువుకునే రోజుల్లో—నాలుగేండ్ల క్రితం-పోకిరీపిల్లలు ఎందరో ఇట్లాంటి ఉత్తరాలు వ్రాసేవారు. ఆనాడూ ఒకరిద్దరికి, ఇట్లాంటి సమాధానమే యిచ్చింది. మాధవి ఆమె పేరు గోడల మీద వ్రాసేవారు బల్లమీద చెక్కేవారు. రోడ్డుమీద వెడుతుంటే కేకలు, ఈలలు-తానివన్నీ ఎరుగును.

తనకిల్లా అవడానికి కారణం, తను రంజిత్‌కి వ్రాసిన జాబుసంగతి గంగాధరంకి తెలిసుండాలి తెలిస్తే, ఆయన మేనల్లుణ్ణి మందలించి చర్య తీసుకుని వుండాల్సింది అట్లా చెయ్యక, తన మీద చర్య తీసుకున్నాడు. మళ్ళా అందరూ ఆయన్ని నిప్పులాంటి వాడంటారు తనపట్ల మోజు కనబరుస్తున్నవ్యక్తి రంజిత్ వక్కడేకాడని కంపెనీలో తనతో పనిచేసే వారిలో యింకా ఎందరో వున్నారని మాధవికి తెలుసు. తను ఆఫీసుకి రాగానే ఏదో వంకని తన గదిలోకి వచ్చి చూసిపోతూ వుంటారు రాజారావు, చలమయ్య, రంగస్వామి. మధ్యాహ్నం టీకి రమ్మని కాంటీన్‌కి తీసుకువెడుతూ వుంటారు. తనని బిల్లు ఇవ్వనివ్వరు. సాయంత్రం వెళ్ళేటప్పుడు వక్కక్షణం తనకంటే ముందుగానే వెళ్ళి గేటుదగ్గర కాచుకుని తనతో కొంతవరకూ నడుస్తూ తనకి రిక్షా మాట్లాడిపెట్టి పంపుతూ వుంటారు. ఎలా కనుక్కున్నాడో రంజిత్ తన గది ఎక్కడ వుందో కనుక్కొని ఆదివారం సాయంత్రం రోడ్డు మీద యింటిముందు పచార్లు చేస్తూ వుంటాడు తను కిటికీలోంచి చూసి నవ్వుకునేది. ఒక రోజు చొరవ చేసుకుని గదిలోకి వచ్చాడు. పిన్ని ఎదురైంది. తను ఇంట్లోలేనని పంపించి వేసింది తనతో కలిసి సినీమాకి రమ్మన్నాడు. రాకపోతే చచ్చిపోతానన్నాడు. అలా అంటూ వుంటాడు. మర్నాడు ఆఫీసులో ప్రత్యక్షం,

ఇప్పుడు పిన్నివుంటే ఎంతబాగుండును! అబ్బాయికి సుస్తీచేసిందంటే వెళ్ళింది. తనూ అక్కడికి వెళ్ళాలి లేచి ముందుగదిలోకి వచ్చింది మాధవి. వీధి తలుపు జారవేసింది. కిటికీ తలుపు సందులోంచి పోస్టువాడు దూర్చిన ఉత్తరం క్రిందపడివుంది. ఆత్రుతతో కవరు చించి చదివింది. అన్న హరికృష్ణ శ్రీనగర్ నుంచి వ్రాసిన కవరు అది. ఎనిమిది రోజుల క్రితం వ్రాస్తే, యిప్పుడు వచ్చింది. తను పనిచేస్తున్న పరిశ్రమ రోజు రోజుకి అభివృద్ధి చెందుతూ మంచి లాభాలు వస్తున్నాయట; ఎందరెందరో అమెరికన్లు తివాసీలు, శాలువాలు కొనుక్కుపోతున్నారుట. వేరే మనియార్డరు పంపించాడుట. తృప్తితో నిట్టూర్చింది మాధవి తనూ అన్నయ్య రెండేళ్ళ క్రితం తీసుకొన్న ఫోటోని గోడమీంచి తీసి చూసింది. అన్నయ్యవి పెద్ద కనుబొమ్మలు. దువ్వెనకి లొంగని వంకీల జుట్టు పొడుగ్గావున్న నాజూకైన ముక్కు. అద్దంలో తన ముఖం చూసుకుంది. తనవి అంత పెద్ద కళ్ళుకావు. అన్నయ్యకంటె తన రంగు వకఛాయ ఎక్కువ. నీడలో తేలియాడుతుంటే పడవ తెరచాప దించేసినట్లు దిగులుని లోనికి నెట్టివేసి, నవ్వుతూ పళ్ళవరస చూసుకుంది. చిగుళ్ళు కొంచెం కనిపిస్తాయి. అమ్మవి అంతేట. తన కది యిష్టంలేదు. అవి కనపడేటట్లు నవ్వమంటూంటాడు రంజిత్. తనలో ఏదో ఆకర్షణ వున్నట్లు ఆఫీసులో వారి ప్రవర్తనవల్ల తాను గ్రహించినా అద్దంలో చూసుకుంటే ఆ ఆకర్షణ ఎందులో వుందో తనకి అర్థంకాదు, ఏమిటో! తాను దిగులుపడవలసిన యీ ఘడియలో తన ఆకర్షణని వితర్కించుకోవటం సమంజసంగా తోచదు. మనిషికి ఏదో జరిగితే దాని ఫలితం మొహంలో చూసుకోబుద్ధివేస్తుంది కాబోలు.

చటుక్కున వొక భావం స్ఫురించింది మాధవికి. సిమెంటురంగు చిర మడతలన్నీ క్రమంగా తిన్నగా జారినట్లు కుచ్చిళ్ళు పోసి తెల్లసిల్కు జాకట్టు వేసుకుని జడ మెలితిప్పి, మెడవెనక ముడివేసి చేతిలో బాగ్ తీసుకొని బయటకువచ్చి తలుపు తాళం వేసింది. కాని ఆ తాళం సరిగ్గా పడటం లేదు. మళ్ళా లోపలికొచ్చి ట్రంకుకి వేసిన పాతతాళం వేసి రోడ్డుమీద కొచ్చి రిక్షాలో బయలుదేరింది. చేతిలో హాండ్‌బాగ్ ఎందుకు? అలవాటు కాబోలు. నవ్వుకుంది. పోస్టాఫీసుముందు రిక్షాని నిలిపి రవిప్రకాశంగారి ఇల్లు

ఎక్కడో కనుక్కొని అక్కడికి పోనీయమంది రిక్షావాడిని. బంగళాముందు నిలిచిందిరిక్షా. ముందు గేటు, చుట్టూ గోడ, వెనుక పూలమొక్కలు. గేటుతోసుకొని లోపలికి వెళ్ళగానే "బోయ్" మంటూ ఒక ఎర్రకుక్క మీద పడబోతూ వుంటే తోటమాలి వారించాడు. తను ముందు గదిలోకి వెళ్ళింది. "అమ్మగారి కోసరమా?" అది తోటమాలి కంఠం. ఈలోగానే అమ్మగారు బయటికి వచ్చింది. ఆమెది ఎత్తైన విగ్రహం. దేనినో చూసి బెదరిపోతున్నట్లు కలవరపడే కళ్ళు. అక్కడక్కడ నెరసిన వెంట్రుకలు ఓపికలేక జెడసరిదిద్దుకోక వొదిలేసిన ఆ పొట్టి వెంట్రుకలు మెడచుట్టూ తిరిగి భుజాల ముందు పడి పూనకంవచ్చిన స్త్రీని స్మరింపచేసే ఆకృతి. ఎవరూ ఎవరి కోసం అన్నట్లు కనుబొమ్మలు చిట్లించింది ఆమె.

"రవిగారున్నారా అండి" అంది మాధవి.

"లేరు"

కాస్సేపు నిశ్శబ్దం.

"ఎవరి తాలూకు నువ్వు"

నిశ్శబ్దం.

"ఎప్పుడు వస్తారండీ?"

నువ్వు ఎవరివో చెప్పావుకాదు." హాలులో గోడగడియారం కేసి చూసింది మాధవి. పావుతక్కువ ఐదు అయింది.

"నేను మాధవినండి."

"గురునాధం మాధవివా?" ఆమె అలా అనడం మాధవికి నచ్చ లేదు. తన అసంతృప్తిని ప్రకటించే ధైర్యం ఆమెకి లేదు.

"కంపెనీ పనంతాపూర్తయ్యాక ఐదు తర్వాత కాని యజమాన్లు యిళ్ళకి రారని నీకు తెలియదూ? అయినా ఏం పనో నాకు చెప్పు." బయట కుక్క మొరుగు వినబడుతోంది. తోటమాలి మొక్కలకు నీళ్ళు పెడు తున్న చప్పుడు వినబడుతూంది.

"వారిని తరువాత కలుసుకుంటాలెండి" అని గబగబ గేటు దగ్గరకు నడిచింది మాధవి. కుక్కని పట్టుకోమంది తోటమాలిని. గేటుదగ్గరగా మూసి వీధి చివర రిక్షా ఎక్కి తనగదికి చేరుకునేటప్పటికి ఐదున్నర కావస్తోంది. స్నానానికి వేన్నీళ్ళు పెట్టుకుంది. పది నిముషాలలో స్నానం పూర్తిచేసుకుని పినతల్లిది పసుపుపచ్చ పట్టుచీర ధరించి జడ అల్లుకుంటూ ముందు గదిలో మంచంమీద కూర్చుంది. పైకి లేచిన మంచంకోడుపై తల అనించి జడ క్రిందకి జారుతూ వుండగా విశ్రమించింది మాధవి. ఐదు, పది నిముషాలలో ఆరు దాటిపోయి వుండాలి. పెరట్లో చివరి కిరణాలు పోయి చీకటి నీడలని దిగవిడిచాయి చెట్ల ఆకుల రంగు కరిగిపోతూంది. కిటికీలోంచి పశ్చిమ ఆకాశం చిరగ్గామిగిలిన ఎర్రజండా ముక్కవలె ముడుచుకుపోతోంది గుమ్మం అవతల ఏదో అలజడి అయి మాధవి చటుక్కున లేచి కూర్చుంది. తప్పకుండా రంజితే-కాదు. "నువ్వేగా మాధవివి?" అన్నాడాయన. మరో రెండడుగులు ముందుకి వేసాడు. "నువ్వు నన్ను ఎరగవేమో. నేను రవిప్రకాశంని" అన్నాడాయన.

కాస్తంత భయంతో వొక్కడుగు వెనక్కి వేసింది మాధవి. ఏవో చాలా చెప్పుకోవాలి ఆయనతో. కాని ఏది ముందు అనాలో ఏది వెనుక అనాలో తేల్చుకోలేక, ఏమీ అనలేకపోతూంది.

"ఇందాక విన్నాను. గంగాధరం తీసేశాడుటగా. వినగానే వచ్చాను, తిన్నగా. మా కంపెనీలో ఉండటానికి అభ్యంతరం లేకపోతే రేపుదయం పదకొండుకిరా, కంపెనీకి" అని రవిప్రకాశం గబగబ వీధిలోకెళ్ళి కార్లో ఎక్కాడు. ఆ కార్లో ఇంకా ఎవరెవరో ఉన్నారు. మాధవి వీధిగుమ్మం దాటగానే కారు వెళ్ళిపోయింది. అందులో ధ్వనులు, వీధిలోదుమ్ము, సంధ్యలో ఊదా....అన్నీ తనని చుట్టుముట్టాయి. లోపలికొచ్చేసింది మాధవి.

పనిమనిషి గంగమ్మ వచ్చింది. రాత్రి, సాయంగా పడుకుంటుంది. ఆ రాత్రిమాధవికి నిద్రపట్టలేదు. తనమీద తనకి కోపంవచ్చింది. రవిప్రకాశం గార్ని లోపలికొచ్చి కూర్చోమనలేదు. మర్యాద చేయిలేదు. కృతజ్ఞత

వెలిబుచ్చలేదు. తను ఉద్యోగం కోసరం ఏ రవి ప్రకాశంని వెతుక్కుంటూ వెళ్ళిందో ఆ రవిప్రకాశమే స్వయంగా తనింటికొచ్చి ఉద్యోగం ఇస్తానంటే లోపలికొచ్చి కూర్చోండి అనైనా అనలేదు తను.

రవి ప్రకాశం, ఊళ్ళోనే, మరో కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్. అమెరికాలో కంపెనీల నిర్వహణలో శిక్షణపొంది రెండేళ్ళు ఉత్తర హిందూస్థానం కంపెనీలలో పనిచేసి, ఇక్కడ కంపెనీ డైరెక్టర్‌గా ఏణ్ణర్థంక్రితం చేరి పని చేస్తున్నాడు. అయన్ని గురించి వింత వింతగా చెప్పుకుంటారు. ఆయన్ని గురించి చాలావిన్నా ఆయన్ని చూడ్డంపడలేదు. రెండు కంపెనీలు ఉమ్మడిగా సమకూర్చుకోవలసిన వ్యవహార సదుపాయాలున్నాయి. ఇచ్చిపుచ్చుకోవడాలున్నాయి. రవిగారు గంగాధరం కంపెనీకి చాలామార్లు వొచ్చాడు వొచ్చినట్లు తెలియగానే తాను, ఆయన్ని చూడ్డానికి బైట కొచ్చేది. ఇప్పుడే వెళ్ళిపొయ్యాడు అనేవారు. ఆయన రావడమేగాని, గంగాధరం వారి కంపెనీకి వెళ్ళినట్లు చెప్పగోరు రవి నెల జీతం తీసుకునే ఉద్యోగి కాని కంపెనీ వ్యవహారాల నిర్వహణలో ఆయన ప్రతిపత్తి లేదు. ఉద్యోగాలివ్వడం తీసెయ్యడంలో, సలహా ఇవ్వగలడుగాని దాన్ని ఆచరణలోకి తెచ్చే అధికారం ఆయనకిలేదు. గంగాధరం అల్లాకాదు. అతను కలపెనీలో యజమాని భాగస్వామి కూడా. అతనికి అధికారాలెన్నో వున్నాయి. ఎంతో పలుకుబడి, ప్రతిష్ఠ కలవాడు. ఇతర కంపెనీల వ్యవహారాలలో కూడా జోక్యం చేసుగుని కొన్ని పనులు చేయించుకోగల ప్రజ్ఞ గలవాడు.

యాజమాన్యన్నీ, మెంబర్లనీ, భాగస్వాముల్నీ సంప్రదించకుండానే "రా ఉద్యోగం ఇస్తా" అని ఎల్లా అనగలిగాడో రవి ప్రకాశం! ఈ కిటుకులు, తికమకలు తనకి అర్థం కావు.

మర్నాడు పదకొండు గంటలకే మాధవి, రవిగారి కంపెనీ కెళ్ళింది. శుభ్రమైన దుస్తులు ధరించింది. శ్రద్ధగా జుట్టు అమర్చుకుంది. సన్నటి నడుంచుట్టూ చీర మడతలు తిన్నగా జారుతున్నాయి. ఆ మడతలు కలిసిపోక అల్లాతిన్నగా నిలబడ్డం ఆమె కిష్టం, అద్దంలో చూసుగుని "బాగానే ఉన్నాను" అనుకుంది.

రవిప్రకాశంగారి గదిలో కెళ్ళడానికి అనువైన దుస్తులు, వేషం, నిన్న ఆయన్ని ఆ చీకటిలో సరిగ్గా చూడనేలేదు. ఆయన పెద్దవాడిలాగే కనిపించాడు. మీసాలున్నాయా? పాపిటి తీసిన క్రాపింగా? ఎగదువ్వా? పాంట్ బుష్కోట్ జ్ఞాపకం. చామనచాయ. నవ్వు మొహం. ఎందుకు పది నిముషాల్లో ఆయన్ని చూడబోతోందిగా. ఎవరో ఒకాయన వొచ్చి "నాతో రండి" అన్నాడు. వరండాదాటి బైటకొచ్చి మరో రేకుషెడ్‌లోంచి వెళ్ళి అవతలివైపు ఆఫీసుకి వెళ్ళారు. మూల గదిలో ఒకాయనలేచి బల్లమీద కూర్చోమని మందహాసం చేశాడు. టైప్ కాగితం ఒకటిచ్చాడు. మరో కాగితంపై సంతకం పెట్టమన్నాడు. గంగాధరం కంపెనీలో, తన జీతం తొంభై. ఇక్కడ నూటపాతిక. సంతోషంతో సంతకం పెట్టింది

"రవిగార్ని చూడనక్కరలేదా?" అని అడిగింది. అక్కర్లేదన్నట్లుగా తలపంకించి నవ్వి నౌకర్ని వొప్పగించి రేకుషెడ్ వెనకవున్న నాలుగు గదులలో ఒకదాంట్లోకి తీసుకెళ్ళి బల్ల, కుర్చీచూపి.... ఇదే తను పనిచేసే చోటు.... అని చెప్పి ఏమన్నా కావాల్సి వొస్తే అడగండి, చేస్తానని ఆ వ్యక్తి వెళ్ళిపొయ్యాడు.

మధ్యాహ్నం పనివాళ్ళంతా టీ కి బైలుదేరారు. దూరంగా షెడ్డులో కాంటిన్‌లో టీ దొరుకుతుంది. ప్రతి ఒక్కరూ ఒక కప్పులాంటిది తీసుకు వెడుతున్నారు. మాధవికి ఇది నచ్చలేదు. తనని ఎవ్వరూ రమ్మనలేదు. ఇంతలో నౌకరొచ్చాడు. రెండు కాగితాలిచ్చి "అయ్యగారు ఇవి టైప్‌చేసి పంపమన్నారండి" అన్నాడు టీ విషయం తరువాత చూద్దామనుకుని ఆ రెండు కాగితాలు టైపుచేసింది నౌకరుకోసం అటూ ఇటూ చూసింది. మరో నౌకరు కనబడ్డాడు. "అయ్యగారి రూమ్ ఎక్కడ?" అని అడిగింది. వాడు ఆమెని రవిప్రకాశం గదికి తీసుకువెళ్ళాడు.

"కమిన్" అన్నాడాయన.

వెళ్ళింది.

"అట్లా కూర్చో. పేపర్స్ నువ్వు తేనక్కర్లేదు. ప్యూన్‌తో పంపితే సరిపోనుగా" అన్నాడు. తెల్ల బుష్కోట్- పక్కపాపిడి, వొంకీలజుట్టు, కాస్తంత పొట్టిముక్కు; పై పెదవి సన్నం, అడుగుది గుండ్రంగా పెద్దగా

కనబడింది ముక్కుకి నోరుకీ కాస్తంత దూరం.... నవ్వుమొహం, మంచి పళ్ళవరస, పైవరసలో ఒకటి మాత్రం కొంచం వెనకగా వుంది. సన్నటి పొడుగాటి వేళ్ళు.... వెడల్పాటి అరచెయ్యి. ఆర్చిలా తీర్చిదిద్దిన కనుబొమ్మలు.... మధ్యకొంత లోతుగాదిగి, పైనాకిందా చదరంగా వొంపు తిరిగిన విశాలమైన నుదురు. ఆ లోతులో రెండుగీట్లు. వయస్సు నలభై పైమాటే.

"ఏవీ కాగితాలు" అని ఆమెవద్దనుండి కాగితాలు తీసుకుని చదువుతున్నాడు. నౌకరొచ్చి రెండు కప్పుల్లో టీ సిద్ధంచేసి ఆమె ముందు ఒకటుంచాడు.

మరో ప్లేట్లో బిస్కట్స్, సాండ్విచ్ పెట్టి ఆమె ముందు వుంచాడు

కాగితం చదవడం పూర్తిచేసి చిన్నగా నవ్వాడు రవి.

"చాలా తప్పులున్నాయి కాదండీ" అంది మాధవి. ఆమెని పరీక్షగా చూస్తున్నాడు రవి.

"నాకు ఇంగ్లీషు బాగా రాదు."

"ఇక్కడ మిసెస్ జాకబ్ వుంది. మధ్యాహ్నం ఒకగంట ఆమె దగ్గర నేర్చుకోరాదు....? మరిచాను. టైప్ స్పేసింగ్ బాగానేవుంది.... దగ్గరలో... ఒక టైప్ ఇన్స్టిట్యూట్ వుంది. సాయంత్రం అక్కడ ఒక గంట ట్రైనింగ్ఐతే.... స్పీడ్ పికప్ చేస్తావు.... ఏం....?" అని నవ్వుతున్నాడు.

"ఉ....కానీ." అన్నాడు, కప్పుకేసి చూస్తూ. భయ పడుతూ తింటోంది. టీ సాసర్లోపోసి త్రాగుతోంది. తొణికికొంత చీరమీద పడింది.

"అయ్యో" అంది మాధవి.

"చీర పాడవదూ-మరి!"

మాధవి లేచింది. సాసర్ బల్లమీదపెట్టి, అందులో కప్పు వంకరగా నిలబెట్టింది. రవిప్రకాశం నవ్వి దాన్ని సరిగ్గా నుంచోబెట్టాడు. లేచి నిలబడ్డాడు. "మరి నీ పని చూసుకో" అన్నాడు. ఆమె వెళ్ళబోతూంటే. "ఇదిగో కర్చీఫ్ కుర్చీలో విడిచేశావ్" అన్నాడు. రుమాల తీసుకుంది.

"నే నెప్పుడూ ఇంతే....ఇల్లా మరిచిపోతూంటానండి"అని, అతిశయోక్తిగా నవ్వి, వెళ్ళిపోయింది మాధవి.

నాలుగైదు నెలల్లో మాధవి టైప్ నిపుణత పెరిగింది. మిసెస్ జాకబ్‌వద్ద ఇంగ్లీషుపాఠాలు నేర్చుకుంటోంది. ఆఫీస్ వ్యవహారాల్లో తన పనిని బాగా అవగాహన చేసుకుంటోంది. రవి కార్యదర్శిగా, అతని గది పక్కగదిలోకి మార్చారు. ఆమెబల్ల, కుర్చీ ట్రేలు టైప్‌యంత్రం, నోట్ బుక్స్, ఫైల్స్. వారంలో ఆగదిలో ఒక టెలిఫోన్‌కూడా అమర్చారు. ఇంటి దగ్గర పినతల్లివుంది....వొండి పెడుతుంది. అన్నయ్య తివాసీల వ్యాపారం లాభిస్తోంది. ప్రతినెలా, మనియార్డర్ పంపుతూనే ఉన్నాడు. మనస్సు కుదుటబడి, ఆనందంతో నిండుకున్న కొద్దీ, మాధవి సౌందర్యం వికసించి రాణిస్తోంది. మంచి మంచి దుస్తులు ధరిస్తోంది. జడ జాగ్రత్తగా వేసుగుంటోంది.జెడలో గులాబి ఉంచుతుంది పాపిడ మరికొంచెం పక్కగా తీసి, జుట్టు చెంపలమీదికి లాగుతోంది....ఒకటి రెండుమార్లు పిన్ని నణిగినా వినిపించుకోక, "ఇప్పుడంతా మా ఆఫీసులో ఇంతే" అంది.

"వాళ్ళు పొయ్యే పోకిళ్ళన్నీ మనమూ పోతామా ఏమిటీ!" అంది పిన్ని.

"ఇన్ని చేసుగున్నా బాగులేనుగాపిన్నీ .... ఎంత బాగున్నావే అమ్మా....అని వొక్కసారన్నా అన్నావా?" అంది దిగులుగా. పిన్ని ఆమె తలని తన వొళ్ళో ఉంచుకుని "వెర్రి పిల్లా....మీఅమ్మ వుంటే ఎంత సంతోషించునో. నేనెంత మెచ్చుగున్నా, మీ అమ్మ మెచ్చుకున్న తృప్తి నీ కుండదు గదా" అంది ఆమె కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

"అదేమటి పిన్నీ....ఊరికే....అన్నా. అమ్మకీ, పిన్నికీనాకా తేడాలు తెలియవు." అంది మాధవి.

టైప్ ఇన్‌స్టిట్యూట్‌కి ఎంత ఇవ్వాలో తెలుసుకుని చెల్లించాల్సివుంది మాధవి, అడిగేసరికి ఇదివరకే కంపెనీవారు బిల్లు ఇచ్చేసారన్నారు. తన లాగే మరో ఇద్దరూ కూడా అక్కడ కంపెనీడబ్బుతో శిక్షణ పొందారట. అల్లాంటి శిక్షణ ఇచ్చే బాధ్యత కంపెనీదే అని మెంబర్లతో వాదించి వొప్పించాడుట రవి. అమెరికాలో అలా చేస్తారట. నసిగినా చివరికి

వొప్పుకున్నారు భాగస్వాములు.

ఆ నెలలో మరికొన్ని సదుపాయాలు కల్పించాడు రవి. ప్రతి గది లోనూ ఒక మూలగా అందరికీ అందుబాటులో వుండేలాగున ఒక టెలి ఫోన్ పెట్టించాడు. ఇదివరకు ఒక్కటే ఫోనుంటె, పిలుపొచ్చి నప్పుడల్లా పక్కగదిలోకి వెళ్ళడం మామూలు వాడి బల్లమీదే ఫోను ఎందుకుండాలని పట్టింపులు, స్పర్థలు ఇంక ఇప్పుడవి ఉండవు. ప్రతివాడికి కప్పు, సాసర్లు, గ్లాస్ ఇప్పించాడు. గదుల్లో కోయిర్ చాపలు వేయించారు....పాదాలు నేల మీదకాక, చాపలమీదఅనిస్తే అలసట చెందక పనివాండ్ర ఆసక్తి పెరుగు తుందిట. మిగత మెంబర్లు ఈ దుబరా నిరసించి ఈ సదుపాయాలతో కంపెనీ దివాళా తీస్తుందని మొత్తుగున్నారట. ఈ ఒక్కదానికీ వొప్పు కోండి అంటూ ఒక్కటొక్కటే....సౌకర్యాలు ప్రవేశ పెడుతూ వొచ్చాడు రవి.

ఎవరికన్నా వొంట్లో బాగాలేక శెలవుచీటీపంపితే, సాయంత్రం వాళ్ళింటికివెళ్ళి చూసి వొస్తాడు. కాంటీన్‌లో రేడియోసెట్టు నెలకొల్పారు.... టీ సమయంలో, అందరూ ఫిలిం సంగీతంవిని వినోదిస్తారు. షెడ్లనడుమ ఖాళీస్థలంలో మొక్కలు ఫౌంటెన్ వేయించాడు. రామప్ప గుడిలో వుండే నాగిని శిల్పాల నకలు తయారు చేయించి గేటుముందు అమర్చారు. ప్రతి గదిలోనూ అందమైన చిత్రాలు శిల్పాలు తెప్పించి వుంచాలన్న రవి సంకల్పం కొనసాగడం లేదు, మనకి లాభాలు కావాలిగాని ఈ తైతక్క బొమ్మ లెందుకన్నారు భాగస్వాములు. అందమైన బొమ్మలపట్ల అభిరుచి పెరిగితే, మనస్సు తైతెక్కలాడి లాభాలు పెరుగుతాయని రవి వాదం. విని నవ్వుతారు. అమెరికా తాలూకు పిచ్చన్నారు.

ఏడాది పూర్తి కావస్తోంది. రేపోమాపో లాభనష్టాల లెక్కలుకట్టి బోనస్‌లు ప్రకటిస్తారు. అందరూ దీక్షతో పని చేస్తున్నారు. ఆనాడు శని వారం. కుస్తీల ప్రదర్శన చూడాలంటూ అనుమతిపొంది మధ్యాహ్నమే కొందరు వెళ్ళి పొయ్యారు. మూడైంది. రవిగదిలో ఫోన్ మోగింది.ఎవరో మాధవితో మాట్లాడాలని పలకరించారు. ఫోన్‌లో మాట్లాడవల్సిందిగా మాధవికి కబురంపాడు రవి. ఆమె వొచ్చింది ఫోన్‌లో సుఖవుగా ధీమాగా

మాట్లాడే అలవాటు కాలేదు. జంకుతూ చెవి దగ్గర రిసీవర్ ఆనించి వింటోంది. "ఉ" "ఆ" "ఆ''...."అహ''....అన్న శబ్దాలు తప్ప పూర్తి మాటలు చెప్పలేకపోతూంది మాధవి. రవిబల్లమీద కలంని ఒక చేతిలో తీసుకుని నలుపుతోంది వొదిలేసి చీరకు తుడుచుకుంటోంది. గోడమీద వున్న తైలవర్ణచిత్రాన్ని చూస్తోంది.

"సరే....ఉహూ" అని ఫోన్ పెట్టేసి ఏదో అపరాధం చేసిన దానికి మల్లె చూసింది మాధవి. మళ్ళా ఆ బల్లమీది కలంతీసుకుని చీరకొంగుతో తుడిచి, కాప్‌లో వుంచేసి "నే నెప్పుడూ ఇంతే....నండీ'' అంది. రవి నవ్వుతున్నాడు ఆమె చీరకొంగు పూర్తిగాజారి బల్లమీద పడుతోంది. అతను ఆమె వక్షంకేసి చూడ్డం గమనించి సిగ్గుపడి కొంగు సర్దుకుని వెళ్ళబోయింది. ఫోన్‌లో మాట్లాడింది ఎవరో చెప్పాలా? చెప్పనక్కర లేదా? ఏమో....తనకి తెలీదు. వెళ్ళిపోయింది.

రవి ఆమెని కేకేశాడు.

"ఇది నీ పని కాదనుకో — మిసెస్ జాకబ్‌ది — ఆమె సెలవు పెట్టింది—ఈ కాగితం కొట్టిపెడతావా—ఇవాళ పంపాలి" అని ఒక కాగితం ఇచ్చాడు.

"పెందరాళె ఇంటికెళ్ళాలనుకుంటున్నానండీ!" అంది.

"ఏం కుస్తీలు చూస్తావా?" అని నవ్వుతున్నాడు.

"కొంచెం హెడేక్‌గా వుందండి."

ఇంకా నవ్వుతున్నాడు.

"నవ్వుతున్నారేం?"

"ఏంలేదు. ఈ హెడేక్ అనేది ఆఫీసుల్లో పనిచేసే భారతీయుల జబ్బు. అందుకే అమృతాంజనానికున్నంత చెలామణీ మరే ఔషధానికీ లేదు. ఇప్పుడు నా దగ్గర అదిలేదు. ఇదుగో యుడికొలోన్—కాస్త కర్చీవ్ మీద జల్లుకుని నుదిటిమీద ఉంచుకో'' అని డ్రాయర్‌లోంచి ఒక బుడ్డి తీసిచ్చాడు. బుడ్డి తీసుకుని వెళ్ళింది మాధవి. క్షణంలో వెనక్కివొచ్చి "థాంక్స్" అని వెళ్ళింది. రవి బిగ్గరగా నవ్వేశాడు.

గదిలోకెళ్ళి ఆ కాగితాలు బల్లమీద పడేసి గబ గబ గేటుదగ్గర కెళ్ళింది. పది నిమిషాలు అటూ ఇటూ చూసింది. గేటవతల షెడ్లనడుమ మొక్కలమధ్య నడుచుకుంటూ వొచ్చాడు రంజిత్!

"రాణిగారి దర్శనం తొందర్లోనే అయిందే" అన్నాడు. ఇద్దరూ షెడ్లవెనక చెట్టుకింద నీడలో కూర్చున్నారు. అక్కడ పెద్ద పెద్ద రాళ్ళు పడి వున్నాయి ఆమె వొకరాయి మీద కూర్చుంది. అతను గడ్డిలో మో కాళ్ళమీద చేతులు ఆనించి కూర్చున్నాడు.

"రవి గదిలోకి ఫోన్ చేశావ్. మొదట్లో నీతో మాటాడింది ఆయనే తెలుసా?" అంది.

"బాగా తెలుసు. ఆయనకి ఫోన్ చేస్తేనే పని సుళువుగా జరుగుతుంది."

"ఇంకెప్పుడూ అట్లా చెయ్యమాక. నాకు భయమేసింది—ఆయన ఏమనుకున్నాడో ఏమో."

రంజిత్ ఎండ తగలకుండా నల్లద్దాల కండ్లజోడు తగుల్చుకున్నాడు తీసి అద్దాన్ని తుడుస్తున్నాడు.

"ఏముంది అనుకునేందుకు ఈపాటికి నువ్వు గ్రహించే వుండాలి."

"అంటే."

"అందరికీ తెలిసిందే. ఆడది కనబడితే విడిచిపెట్టడుగా"

'నాకట్లా గనిపించలేదు."

"అంతరంగిక కార్యదర్శివిగా నీకెందుకనిపిస్తుందీ...."

"నువ్వట్లాగనడం ఏమీ బాగాలేదు రంజిత్. ఈమాట అనడానికా నువ్విక్కడ కొచ్చింది" అని కోపంతో కళ్ళు పదే పదే చిట్లించింది.

"నువ్వు చాలా మారిపొయ్యావు ఆవును పాపం. రవి ఏంచేస్తాడు. భార్యకి హిస్టీరియా. అదోరకం ఉన్మాదం. మొదట్లో ఇద్దరు సంతానం కలిగారు. ఇద్దరూ దక్కలేదు. అప్పటినుంచి హాస్పిటల్స్, డాక్టర్లు, మందులు—నర్సింగ్ హోమ్‌లు—ఏం చేస్తాడు—పాపం ఆమెని వదల లేదు. అందుకే బొమ్మలు గీస్తాడుట. శిల్పాలు తయారు చేస్తాడుట. సౌంద

ర్యం అంటారు—కంపెనీ వ్యవహారాలు తన ప్రేమ కలాపాలతో వొక దరికి తెస్తున్నాడు. నీకు తెలియకుండా ఉంటుందీ?"

"ఏమిటి నువ్వనేది?"

"మాశావా—నీ ధోరణిలో ఎంత మార్పొచ్చిందో. ఆడాళ్ళు, చిత్రం-డబ్బు హోదాకిలొంగిపోతారు-ముసలాడైనా, ముక్కాడైనా...."

మాధవి లేచింది.

"ఇంకాచాల్లే రంజిత్. నువ్వు వెళ్ళొచ్చు."

"నిజం చెపితే కోపం వచ్చితీరాలి మరి వెడతాను మరి షేక్ హాండ్...." అని చెయ్యిచాచాడు రంజిత్. ఆమె అందుకోలేదు. నడుం వెనకవున్న చేతిని లాక్కున్నాడు. గట్టిగా నొక్కాడు. ఆమె విదిలించి వేసింది.

"నువ్వు ఇంక ఎప్పుడూ ఇటురావొద్దు. దయచేసిఫోన్ చెయవద్దు. నువ్వు నావెంట బడితే నేనేదో చేశానని గంగాధరంగారు ఉద్యోగం తీసేశారు. ఇక్కడిల్లా నాతో వొస్తున్నా వంటె ఈ ఉద్యోగంకూడా పూడుతుంది—తెలుసా. నీకు వెయ్యి నమస్కారాలు" అని గబగబ నడుచుకుంటూ తన గది కెళ్ళింది. ముచ్చెమట్లు పోస్తున్నాయి. చెమటతో జాకట్ భుజంకింద డాగైంది. మొహం తుడుచుకుంది. రవిగారిచ్చిన యుడికొలోన్ నాలుగు చుక్కలు రుమాలమీద జల్లుకుని మొహం తుడుచుకుంది. ఐదు కావస్తోంది. కాసేపు కళ్ళు మూసుకుని కూర్చుంది. కంపెనీపనివాళ్ళు వెళ్ళడం సూచిస్తూ సైరన్ మోగింది. చివాలున లేచికూర్చుంది మాధవి. ఇవాళ టపాలో వెళ్ళాలంటూ రవిగారిచ్చిన కాగితాలకోసం బల్ల మీద చూసింది, అవి అక్కడ లేవు. ఆదుర్దాపడింది. ఏమైనట్లు? రవిగదిలోకి వెళ్ళే ధైర్యం ఆమెకిలేదు. ఎవర్ని అడగడం? డిస్పేచర్ని అడిగి తెలుసుకుంటె!

ఆ వొచ్చింది రవి. తన గదిలోకొచ్చి నిలబడ్డాడు.

"ఫర్వాలేదు. మరొకరిచేత ఆ కాగితాలు టైప్ చేయించి పంపించాను. నీకో విజిటర్ వున్నాడు—నాకు తెల్పు—రంజిత్ చాలా చురుకైన వాడు. ఇంటికి వెళ్ళరాదూ-బాగా టైర్డ్‌గా వున్నావు...." అని ఆమె ఇంకా చెప్పాలను కుంటుండగానే రవి వెళ్ళిపోయాడు. తనూ గబగబ వెనకాలే

వెళ్ళింది అతను గేటు దగ్గర నిలబడ్డాడు. కార్ తెచ్చాడు డ్రైవర్. ఎక్కబోతూ వెనక్కి తిరిగాడు.

"ఏమండీ" అంది మాధవి

"ఎస్?"

"ఏమీ లేదులెండి" అంది.

"ఇంటి దగ్గర దింపనా?"

"ఊ" అన్నట్లుగా తలపంకించింది.

"డ్రైవర్—ఈమెని వాళ్ళింటిదగ్గర దింపిరా" అని తలుపుతీసి ఎక్కమన్నాడు.

"మరి—మీరు....రారా....?" అంది లోనికెక్కుతూ.

నవ్వి తలుపుమూశాడు రవి. కారు కదలగానే పూలమొక్కలు చూడ్డాని కెళ్ళాడు.

ఆ ఏడు లాభనష్టాలు లెక్కకట్టి బాలన్స్‌షీట్ తయారుచేశారు. గంగాధరం కంపెనీకి లాభాలొచ్చాయి. కొంత బోనస్ ఇస్తున్నామని ప్రకటించారు. కాని పెద్ద లాభాలొచ్చినా, అసలు సంఖ్య బైటపెట్టక్కయీ కాస్తే వొచ్చింది గావున, ఇంతే బోనస్ ఇవ్వగలుగుతున్నామన్నారు. భాగస్థులు సొమ్ము చేసుగుని పనివాండ్రని దగా చేశారన్న వదంతి బైలుదేరింది. ఇది ప్రచారం చేసిన వ్యక్తులెవరో తెలియదు ఈ వివరాలన్నీ నలుగుర్నీ పోగుచేసి సమ్మె చెయ్యాలని పురిగొల్పాడు, గంగాధరం కంపెనీలో వ్యక్తి ధనంజయం.

"చూడండి రవిగారి కంపెనీకి కానీ లాభం రాలేదు— ఈ ఏడు అయినాసరే, అంత నష్టమూ రాలేదు గావున కనీసం ఒకనెల బోనస్సన్నా -కనీసపు మొత్తమే అనుకోండి--ఇచ్చి తీరాలని పట్టుబట్టి యాజమాన్యాన్ని వొప్పించి, తీర్మానం ఆమోదించేటట్లు చేశాడు అతనూ మనిషంటె...." అంటాడు ధనంజయం.

"అవునోయ్. మరి రవిగారు ఆ కంపెనీలో భాగస్థుడు కాడు. కంపెనీ ఏమైపోతే అతనికేం—ఇమ్మంటాడు. అతని కేం—కంపెనీకి కాని

లాభం చూపలేకపోయ్యాడు రవి ప్రకాశం—ఏం డైరెక్టర్ నా మొహం. పైగా అమెరికాలో చదివాట్ట! అదుగో ఆ సెక్రటరీని వేసుగుతిరగటం, షికార్లు, సర్దాలు, రొమాన్సులు—ఎంత బోనస్సన్నా ఇమ్మంటాడు. తన సొమ్మేంపోయింది" అని దొరకపుచ్చుకున్నాడు లక్ష్మీకాంతం.

"అట్లాగననకు మరి సెక్రటరీతో చనువుగా ఉన్నంత మాత్రాన అతని శీలం మొత్తంగా తుడిచిపెట్టివేస్తే నేనొప్పను సుమా. వర్కర్సుకి ఎన్ని సదుపాయాలు సమకూర్చాడు! ఎంతో ఆదరణతో, ఆప్యాయతతో చూస్తాడు అక్కడ వాళ్ళని! కంపెనీ సొమ్ము తన స్వంతానికి కానీ ముట్టడు. వాళ్ళంతా హాయిగా తృప్తిగా, సంతోషంగా పనిచేస్తారు. ఇంక మనయ్య ఉన్నాడు గంగాధరం ఏమిటి ఈయన ఘనత? బంధుకోటికి ఉద్యోగాలు, స్వంత డబ్బు కానీ ఖర్చు పెట్టనక్కరలేదు. ప్రతిదీ కంపెనీ పేరిటే. లాభాలొస్తే, అసలెంతో బైటపెట్టక, తప్పుడు సంఖ్య బైటపెట్టి, ఏదో కాస్త బోనస్ మన మొహాన పారేసి ఆయన ఇతర భాగస్థులు, లాభాలు గుటకాయస్వాహా చేస్తారు. వాళ్ళూ స్వార్థపరులే గావున కిక్కురు మనరు. గంగాధరానికి వేతనాలు పెంచడం, ప్రమోషన్లు, పలుకుబడి...., ఓ సీచిత్రం....రేపో మాపో ఎలక్షన్‌కి నుంచోపెడతారు. స్వార్థపరుల స్వర్గం మన కంపెనీ" అని ధనంజయం.

"అవును మరి—మరిచిపోకు—అతనికి అల్లరిచిల్లరి తిరుగుళ్ళు, పోకిళ్ళు లేవు. ఏకపత్నీవ్రతుడు. భార్య అనసూయ మహా ఇల్లాలు. ఎన్నో అవకాశాలున్నా అన్నింటినీ వొదులుకుని ఏ పోకిళ్ళూపోక, ఆ భార్యతో అలా ఉండగలగటం మాటలా? ఈ రోజుల్లో అది ఎందరికి సాధ్యం? అందుకనే ఆయన వృద్ధిలో కొస్తున్నాడు. కంపెనీకి లాభాలు తెస్తున్నాడు. కాస్తో కూస్తో బోనస్ అంటూ ఇస్తున్నాడు. ఆయనే గనక ఎలెక్షన్‌కి నిలబడితే నా వోటు ఆయనదే. మాధవీలత వొకటల్లుకున్నదీ అన్నట్లుగా ఆ రవి ప్రకాశం—మాధవి కలిసి కంపెనీని ఒక దరికి తెస్తారు సుమా" అన్నాడు లక్ష్మీకాంతం.

కాని జనం, ధనంజయం మాటే సబబైందన్నారు. సెక్రటరీతో తులికితే ఏం మహా ప్రమాదం అన్నారు. అది వ్యక్తిగతమైందన్నారు.

తమకి కావల్సింది బోనస్. గంగాధరంలో నిజాయితీ లోపించింది. అసలు విషయం చెప్పక దగా చేసి లాభాలు జేబులో వేసుకుని పనివాండ్ర సంక్షేమం గురించి పట్టించుకోని స్వార్థపరుడు. ఆయన ఎన్ని తప్పులు చేసినా బైటికిరావు కిందవాడు కాస్త తప్పుజేస్తే సంజాయిషీఐనా అడక్కుండా ఉద్యోగంలోంచి తీసివేస్తాడు. హరికృష్ణని అంతే. వాడు మతిపోయి, గతి లేక దూరప్రాంతానికి పారిపొయ్యాడు ఆ మధ్య మాధవిని తీసేశాడు. ఈయన తీసేసిన వాళ్ళకి పాపం, రవిప్రకాశం ఆశ్రయమిచ్చాడు, అన్నారు పనివాండ్రు. సమ్మె నోటీసివ్వాలని నిర్ణయించారు. నోటీసిచ్చారు. రెండు వారాల తరువాత సమ్మె చేశారు. కంపెనీ మూసేశామన్నారు యజమానులు. లాకవుట్ అన్నారు.

మూడు రోజుల్లోనే పేచీ పరిష్కారమైంది. మరో నెల బోనస్ ఇవ్వడానికి నిర్ణయించారు. ఇది సమ్మతమేనని, సమ్మె విలిపివేశారు. కాని ధనంజయంని ఉద్యోగంనుండి తొలగించారు. ఏవేవో కారణాలు చూపెట్టారు. లెక్కలు తప్పులన్నారు. డబ్బు కక్కూర్తన్నారు. పై వాళ్ళు తీసుకుంటుంటే నే తీసుకుంటే తప్పేమిటంటున్నాడు ధనంజయం. అది డిఫమేషన్ కింద వొస్తుంది. ఋజువు చెయ్యకపోతే, జైలు కెళ్ళాలిసొస్తుందని బెదిరించారు. అతను ఋజువు చెయ్యలేదు. పొగతో జగడం. శాపనార్థాలు పెట్టి ధనంబయం, రవిప్రకాశం దగ్గర కెళ్ళి ఉద్యోగం కావాలన్నాడు.

“నువ్వు క్షమాపణ తెల్పితే వారు నిన్ను మళ్ళా పనిలో ఉంచుకుంటారు” అన్నాడు రవి.

“చస్తే ఆ పని చెయ్యను. లాభాలు గుంజి మమ్మల్ని వీధిపాలుచేసి వాళ్ళేం బాగుపడతారు. మీరెరుగరుగనకనా-నాకు మీ దాంట్లో చూడండి” అన్నాడు దీనంగా ధనంజయం.

“క్షమించాలి, ఆ పని చెయ్యలేను. కంపెనీలు నడిపేవారు, లాభాల కోసం శ్రమించడంలో తప్పేమీ లేదు. ఏమీ ఆధారం లేకుండా ఏదో గాలి కబురుచ్చుకుని నువ్వు అనవసరంగా అల్లరి పడుతున్నావు. నువ్వు అలా ప్రచారం చేయడం తప్పు. ఋజువు చెయ్యలేవు. అట్లాంటప్పుడు ఆవేశంలో దురుసుగా వ్యవహరించినా క్షమాపణతెల్పితే తిరిగి వారు నిన్ను

పనిలో చేర్చుకునేలాగ వారితో సంప్రదించి నచ్చచెప్పగలను. సరా?" అన్నాడు రవి.

"అవుతే, ఇక్కడ లాభం లేదంటావా?"

"నీ మనస్సు ఇంకా కుదుటపడలేదు. ఓ వారం పాటు, ఎక్కడి కన్నా వెళ్ళి విశ్రాంతి తీసుకువిరా...."

"మాకు వొకటే విశ్రాంతి—చచ్చాక. డబ్బున్న వారికి సాధ్యం గాని, మాకెట్లా వీలవుతాయండి, అలా షికారెళ్ళి విశ్రాంతి తీసుకోడాలు!"

నవ్వుతున్నాడు రవి.

"నువ్వు ఊ అంటే ఆ ఏర్పాట్లన్నీ నే చేస్తాను సరేనా? నేను చెయ్యడం ఇష్టంలేకపోతే, గంగాధరంగారే, నీకా సదుపాయం కల్పించే ఏర్పాటు చెయ్యనా....?"

ధనంజయం కోపంతో వెళ్ళిపొయ్యాడు. లక్ష్మికాంతం సలహాపైన, నరసయ్య దగ్గరకెళ్ళి ఉద్యోగం అడిగాడు. నరసయ్య డబ్బున్న ఆసామీ. ఆయనకి ఈ రెండు కంపెనీలలో భాగముంది. పాతకాలపు మనిషి. వయస్సు దగ్గర దగ్గర అరవై. వ్యవహారమంతా తమ్ముడు చూస్తూ వుంటాడు. నరసయ్య చదువుకున్నవాడు కాడు.

"ఏమంటాడు ప్రకాశం?"

"పెట్టుకోనన్నాడు. అది వీలు కాదంట. క్షమాపణ చెప్పి, గంగాధరం దగ్గర కెళ్ళమన్నాడు."

"తీరిపోతుందిగా. అట్లా చెయ్యి. నాకు రెండూ వొకటె."

"మరి మాధవివి ఎలా వేసుగున్నాడండి?"

నరసయ్య నవ్వుతూ మీసాల నడుమ పళ్ళు ప్రదర్శించాడు.

"మాధవి ఆడదిగా!"

"అదే అంటాడు మా లక్ష్మికాంతం. మీరెట్లా వొప్పుగున్నారండి? ఆమెకి చేసిన సాయం నాకు చెయ్య గూడదాండి, పిల్లలు గలవాణ్ణి."

"ఎయ్యి చెప్పాడు. పిల్ల బాగుంటుంది. టైపు కూడా బాగానే చేస్తుంది. చురుకైందేనంటారు. ఇంతకీ, ఎందులోనైతే, క్షమాపణ నాకు చెప్పావు-దాల్లే అంటాను. గంగాధరం దగ్గరకే పో."

"మీరూ అంతేనా?"

సరసయ్య బిగ్గరగా నవ్వేశాడు. ధనంజయం మళ్ళా గంగాధరం కంపెనీలోనే చేరాడు. మానేసిన రోజులకి జీతం ఇవ్వనని పేచీపెట్టాడు గంగాధరం. నలుగురూ నచ్చజెప్పాక సరే నన్నాడు.

నెల గడిచాక, రవిప్రకాశంని కలవరంపెట్టే సంఘటన ఒకటి జరిగింది. గంగాధరం బొంబాయి పనిమీద వెడుతుంటె కంపెనీకి కొన్ని సరుకులు కావల్సివచ్చి, మార్కెట్ ధర అందుబాటులోవుంటె, వాటిని తన తరపున కొని పంపించే ఏర్పాటు చెయ్యవల్సిందిగా కోరాడు రవిప్రకాశం గంగాధరం, ఆ సరుకు కొని పంపించాడు. కాని ఒక చిత్రం జరిగింది. మార్కెట్ ధర—కిలోగ్రామ్ ఒక రూపాయుంటే, రెండు రూపాయల చొప్పున కొన్నాడు గంగాధరం. బొంబాయిలో వున్న ఒక స్నేహితుడి ద్వారా, ఆనాటి ధర రూపాయేనని తెలుసుకున్నాడు రవి. ఇందువల్ల కంపెనీకి, సగానికి సగం నష్టం—యీ కొనుగోలు వ్యవహారంలో; గంగాధరం అట్లా ఎందుకు చేశాడా అని ఆశ్చర్యపడ్డాడు గాని, ఆయన్ని ఆ విషయం అడగలేదు రవి. మరో చిత్రం ఏమిటంటే, ఆనాటి మార్కెట్ ధర రెండు రూపాయలనీ, తనకి యీ ధర సమ్మతమైతే కొంటాననీ—ట్రంక్ ఫోన్‌లో రవిని పిల్చి అడిగినట్లు, ట్రంక్ టెలిఫోన్‌లో మాట్లాడుతూ, రవి "సరే అల్లాగే కొను" అన్నట్లూ, ఆ పిదపనే, తాను ఆ సరుకు కొన్నట్లూ చెప్పాడు గంగాధరం. తానీ విషయం ట్రంక్ టెలిఫోన్‌లో మాట్లాడలేదు. మార్చి మూడోతేదీని ఫోన్ చేశానన్నాడు గంగాధరం. మార్చి మూడో తేదీని తాను పైవూరెళ్ళి సాయంత్రం ఆరు దాటాక కాని, కంపెనీకిరాలేదు. ఆ రాత్రి, అతనికి ఫోన్ పిలుపేలేదు. ఏం జరిగింది? హెచ్చు ధరకి కొనడమే కాకుండా, ఈ అబద్ధం ఎందుకో! కలవరపడ్డాడు రవిప్రకాశం.

రవిప్రకాశం ఒంట్లో బాగలేక, శలవుపెట్టి ఇంట్లో వున్నాడు. జపాలు చేయిస్తామంటే భార్య పుట్టింటికెళ్ళింది. ఇంటిలో వంటామెవుంది. సాయంత్రం ఆరు దాటింది పరీక్ష చేసి, మందిచ్చి, డాక్టరప్పుడే వెళ్ళాడు. కాస్తంత తేలికగా వుండి, మండువాలోకి పడకకుర్చీ లాక్కొని, చెట్ల నడుమ, ఆకాశంలోకి చూస్తూ కూర్చున్నాడు. ఎవరో వొచ్చారు నీకోసం

అంది వంటావిడ. పంపమన్నాడు. ఆ వచ్చినామె మాధవి. స్నఫ్‌కలర్ సిల్కు-చీర వేసుగుంది. నల్లరంగు జాకెట్, తల్లోపూలు. మర్నాడు పూర్ణిమ. చందమామ వెలుగు ఆకుల నీడల నడుమ, సంధ్యాదేవి బంతాటకి మల్లె, ఎగిరెగిరి పడుతోంది. మాధవి నుదుటిమీద నీడలు, చెక్కిటిమీదికి జారి, వాటి గుండ్రదనాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయి. పెదవుల ఆకృతి, ముక్కు-అమరిక, కనురెప్పల పొడవు, స్వప్నంలో చూసిన చిత్రంలో వ్యక్తికిమల్లె వింతగా కనబడసాగింది మాధవి. ఆ ప్రతిమ వెనుక మనుషులు, సమాజంలేరు. ఏకాకికి సాధ్యపడే ఒక స్వేచ్ఛతో కూడిన ఆకర్షణ ఆమెలో గమనించాడు. ఇదివరకింత పరీక్షగా చూసిన జ్ఞాపకంలేదు అతనికి, అస్వస్థతచే వ్యాకులపడ్డ శరీరం, అందలి ఇంద్రియాలు మరింత తీక్షణమై, విశాలమై దేన్నో అన్వేషిస్తూ కొత్తపరిమాణాన్ని తెచ్చుగున్నట్లు, ఆమె మూర్తిని చూడ్డంలో నూతన వికాసాన్ని చూరగొంటున్నాడు. అదొక మూగ అనుభవం—కాని విండైనది. అందులో కోర్కె-తాలూకు జిజ్ఞాసలేదు. వాంఛ ప్రేరేపించగా వుప్పొంగిన తృష్ణ కాదది. అది, వుంది, లేదు-తిలకించే మనిషిలోని తాత్కా-లిక వేగిరపాటుతో ముడిపడ్డ అనుభూతి—

"మండువాలో కుర్చీ తెచ్చుగుని ఇల్లా కూర్చో."

"ఎల్లా వున్నారు? మిమ్మల్ని చూడకుండా వుండలేక పొయ్యానబ్బ!" అంది మాధవి కుర్చీ దగ్గరగా లాక్కు-ని కూర్చుని, రవిప్రకాశం నుదుటిమీద అరచేతిని రాస్తూ.

"ఇప్పుడేంలేదు. అంతా బాగైంది—భారతీయుల అభిమానజాడ్యం, తలనొప్పిమినహా" అని నవ్వుతూ, ఆమె చేతిని తన చేతిలోకి క్షణం పట్టుకుని, విడిచి, తొలగించాడు.

"యుడికొలోన్ వ్రాయనా?"

"అది పైతలనొప్పికి—నాది లో తలనొప్పి" అన్నాడు నవ్వుతూ.

"మీరన్నీ తమాషాగా అంటారు. లో నొప్పికి పైపట్టు పనికిరాదాండి?" అంటూ లేచి, కుర్చీవెనక్కి- వెళ్ళి, రెండు చేతులతో అతని నుదుటిని రాస్తూంది మాధవి. ఆమె పమిట జారి, అతని వక్షంపై పడింది.

తలవొంచి, పక్కకితిప్పి, చెక్కిలిని అతని చెంపకి రాసింది. ఇంకా కిందికి వొంగింది. ఆమె స్తనాలు బింకంగా అతని మొహాన్ని, మెడనీ తాకి, శిఖరాన్ని ఆవహించి పీకుతున్న తెల్లమేఘమల్లె మెత్తటి బరువు మోపుతున్నాయి. మీదపడ్డ పమిటని తోసేశాడతను. ఆమె రెండు చేతులూ పట్టుకుని, పైకినిలబెట్టి, కళ్ళల్లోకి తీవ్రంగా చూశాడు. చేతులు విడిచేసింది.

"తగ్గిందా?"

ఏమీ మాట్లాడలేదతను.

"కోపమా?"

"ఓ."

"మరోసారి రాయనా?" అని నుదుటిని రాస్తూ అతని గడ్డంకింద పెదవులతో తాకింది. ఆమెని విదల్చుకుని, కుర్చీలో లేచి కూర్చున్నాడు.

"అవుతే నిన్ను ఉద్యోగంలోంచి తీసివెయ్యాలి."

"అమ్మో—ఇంకెప్పుడూ చెయ్యనులెండి. ఒకనెల శెలవు కావాలి. అన్నయ్య వొస్తున్నాడు" అంది లేచి, తన కుర్చీలో కూర్చుంటూ.

"దానికోసం ఇక్కడికి రావాలా? అప్లికేషన్ భూషణానికిస్తే సరిపోనుగా."

"మిమ్మల్ని చూద్దామనే వొచ్చాను. లో తలనెప్పి ఏమిటో చెప్పరూ—కమలమ్మగారి విషయమా....?"

"కమలమ్మ ఎవరూ?"

"మీ భార్య."

"ఓ. అవును. నీకు పేరు తెలుసే."

"నాకన్నీ తెలుసు. పాపం, హిస్టీరియాతో ఆమె ఎప్పుడూ మంచం పైననేనటగా....!"

"అవును. ఇప్పుడు బాగా మెరుగు—నాలుగైదేళ్ళగా. మరో పదేళ్ళలో ఆమెకి పూర్తిగా నయమౌతుంది...."

"అంటే?"

"అప్పటికి నే ముసిలాణ్ణి అవుతాగా"

మాధవి నవ్వింది. పెదవులు ఎడంగా వుండి, పళ్ళు కనబడుతూంటే ఆమె మొహానికి వొక కళానుగుణమైన అమరిక రావడం గమనించాడు. అందలి వొంకరలు, ఎత్తుపల్లాలు,—చిత్రకారుడికి తెలుస్తాయి. —మామూలుకళ్ళతో చూసే వారికి తెలియదు. సగం వెలుగుపడ్డప్పుడు, ప్రసరించే సగం నీడనడుమ ఆమె అవయవాల సౌకుమార్యం,—లయ,-అతన్ని ఆకర్షిస్తున్నాయి. ఆమె వయస్సు ఇరవై రెండు దాటదేమో.

"ఇట్లారా" అని లేచాడు. ఆమె అతని వెనకాలే వెళ్ళింది. ముందువా దాటి, హాల్లో లైటువేసి, దాని వెనక గదిలో కొచ్చారు అందులో రెండు సోఫాలు, వొక దివాన్, కుర్చీలు వున్నాయి. ఆమె దివాన్‌లో కూర్చుంది. గోడని, నాలుగైదు వాటర్‌కలర్ చిత్రాలున్నాయి. బరువైన ఫ్రేమ్‌లో అమర్చిన, తైలవర్ణ నగ్నస్త్రీ చిత్రాలున్నాయి. మూల బీరువాలో పుస్తకాలు, రంగులు, బ్రష్‌లు, సీసాలు, చిత్రలేఖనం పరికరాలు. పుస్తకాల బీరువామీద ప్లాస్టర్‌తో తయారు చేసిన నగ్నస్త్రీ శిల్పాలున్నాయి. రెండింటికి తలలు లేవు. వొకదానికి కళ్ళులేవు మరోదానికి స్తనాలేలేవు. అట్లాంటివి ఆమె ఎప్పుడూ చూడలేదు. వింతగా పరికిస్తోంది.

"ఇవన్నీ మీరు గీసినవేనా?"

"బాగున్నాయా? నీకేది బాగుంది?"

"నాకన్నీ బాగానే వున్నాయి."

"అట్లా కూర్చో, కదలకు."

అని ఆమె చీరమడతలు, వొక క్రమంలో సర్ది, పమిట జడమీద నుండి భుజాలచుట్టూ కప్పి, కాళ్ళు మడతలేకుండా; ఎడంగా వుంచి, వాటి మీద చీరమడతలు క్రిందకి తిన్నగా జారేలాగు అమర్చి, కదలకుండా కూర్చోమన్నాడు. ఆమె తలపైన గోడకున్న లైట్‌వేసి, తను దూరంగా కూర్చుని, చార్‌కోల్ చిత్రం గీస్తున్నాడు. పైభాగం పూర్తి చెయ్యాలవి పదినిముషాలయ్యాక దగ్గరగా వొచ్చి; ఆమె గడ్డంకింద చెయ్యిపెట్టి పైకి తోసి, తల వెనక్కి పడేటట్లు అమర్చాడు. గట్టిగా అతని మెడవి రెండు

చేతులతోనూ పట్టుకుని, పైకి వొంగి, ముద్దు పెట్టుకుంది. అతను ఆమె దవడమీద బలంగా కొట్టాడు. "అబ్బ".... అని వెనక్కి పడిపోయింది. మొహంమీద రెండు చేతులూ కప్పుకుని ఏడ్పు సాగించింది మాధవి.

పక్షంనుండి క్రిందిభాగం చీరమడతలు ఉన్న చార్‌కోల్ చిత్రం పూర్తి చేశాడు. ఆమె దగ్గరగా వొచ్చాడు.

"కోపమా?" అని ఆమెచేతిని మొహంపైనుండి తొలగించాడు. చేతిని తన గుప్పెట్లో బిగించాడు. ఆమె ఇంకా సన్నగా ఏడుస్తూనే వుంది. కన్నీటి దాగులతో మొహం ఫోకస్‌లేని తెరపై సినిమా బొమ్మలా వొణికిపోతోంది. పల్చటి ఆకుపచ్చ తెర పొరలా.... నాళాలచుట్టూ, పల్చగా వ్యాపించే ఆ రంగు, సంధ్య చివరిదశలో ఆకాశంలో నిల్చిపోయిన ఆకుపచ్చ మేఘమల్లె, ఆమె శరీరఛాయ నడుమ, కనబడి అదృశ్యమవడం, పరోక్షంగా ఉద్రేకం లేకుండా చూస్తున్నాడు.

"ఏదో వొంట్లో బాగలేక.... చిరాకువల్ల.... అల్లా చేశాను కోపం తగ్గిందా?"

మాధవి లేచి కూర్చుంది. ఒక్కసారిగా, అగ్నిగుండం ప్రజ్వరిల్లినట్టు ఏడ్పు సాగించి, అతని తలలో చేతులుపోనిచ్చి క్రాపింగ్ పీకుతూ, అతని మెడమీద, బుగ్గల మీద, వెన్నుమీద బలంగా, గుద్దడం, మొట్టడం రక్కడం ప్రారంభించింది.

"మరి ఎందుకు? నన్నెందుకు ఇల్లా ఇక్కడికి? అంటూ, ఏవేవో ధ్వనులు చేస్తూ భౌతికంగా అతన్ని హింసిస్తోంది. అతను లేచి, ఆమె కళ్ళల్లోకి బాధగా చూసి, దివాన్ మీదికి తోసేసి, హాలుదాటి, మండువా దాటి, చెట్లమధ్య కుర్చీలో కూర్చుని, ఆకాశంలో చందమామ ప్రసాదించే వింత సీడల చోద్యం చూస్తూ కళ్ళుమూసుకుని, విశ్రాంతి తీసుకుంటున్నాడు. అరగంటైంది. లేచి, గదిలోకొచ్చి చూశాడు. మాధవి అక్కడ లేదు.

మర్నాడు సాయంత్రం, ఏదో జ్ఞాపకమొచ్చి కంపెనీ కెళ్ళాడు. పనివాళ్ళకి మరికొన్ని సదుపాయాలు కల్పించాలనుకున్నాడు. ఒకటి, అన్ని గదులలోనూ మంచి తివాసీలు వేయించడం. రెండోది ఒక పెద్దహాలు

కట్టించి, వారంవారం, సినిమా ప్రదర్శన ఏర్పాటు చేయించడం పనివాళ్ళంతా కుటుంబాలతో వొచ్చి చూసి వినోదించే, ఏర్పాటు. కాని మేనేజ్‌మెంట్ సుముఖంగా లేదు. బొంబాయినుండి గంగాధరం ద్వారా తెప్పించిన సరుకు లతో కంపెనీ సొమ్ము సగానికి సగం నష్టమైందని ఆతనికి తెలుసు. వారికి తెలియదు. ఇంకా ఆ సంఘటన తెచ్చిన వ్యాకులత నుండి ఆతను తేరుకోలేదు. ఏదో చెయ్యాలి. కంట్రాక్టర్‌కి చేరే సొమ్ము, ఆదాయం చెయ్యాలంటే, స్వయంగా కట్టడానికి పూనుకోవాలి హాలు. తన ఆసిస్టెంట్ భూషణంకి యిట్లాంటి పనులలో కొంత అనుభవం ఉంది. అతన్ని కదలె య్యాలి. అతన్ని సాయంత్రం ఆఫీసులో ఉండవల్సిందిగా కబురెట్టి ఐదిం టికి కంపెనీ కెళ్ళాడు రవిప్రకాశం. కాని కంపెనీలో, వొకరిద్దరు పనివాళ్ళు తప్ప, ఎవ్వరూ లేరు. భూషణంలేడు. జ్ఞాపకం వొచ్చింది. గంగాధరంకి వాళ్ళ కంపెనీవాళ్ళు పార్టీ యిస్తున్నారు.... బోనస్ ఇప్పించినందుకు. వీళ్ళుకూడా అక్కడికి వెళ్ళి ఉంటారు తనకీ వొచ్చింది ఆహ్వానం. పోనీ వో క్షణం వెడితే నేం? కారు అటు పట్టించి వెళ్ళాడు. గంగాధరం కంపెనీ ఆవరణలో ఆరుబైట కుర్చీలు, బెంచీలు.... జనం నిండి పోయ్యారు. వేదికపై ఉపన్యాసాలు- గంగాధరంని మెచ్చుగుంటో. ఆ మాట్లాడుతున్నది లక్ష్మీకాంతం కాబోలు. వేదికపై, అనసూయ కూడా ఉంది.... గంగాధరం భార్య; వారి ఆదర్శ దాంపత్యాన్ని కొనియాడు తున్నాడు ఉపన్యాసకుడు

అతడు ఏకపత్నీవ్రతుడు—— ఆమె మహా ఇల్లాలు వారి అన్యోన్యం, దాంపత్యం, ఆదర్శంగా, మిగతా వారంతా నడుచుకోవాలిట. నవ్వుకున్నాడు రవిప్రకాశం. అనసూయ మంచిది- ఆతనూ మంచివాడే,— స్వంత సొమ్ము కానీ ఖర్చు చెయ్యరు. అనసూయ మనిషి బాగుండదు. ఐనా యాభై య్యో పడిలో పడ్డాక అందచందాల జోలెందుకు? నీతి, విజా యితీ, దయా దాక్షిణ్యం.... ఇతరులకి మేలు చెయ్యటం.... ఇవి కావాలి. మార్కెట్ ధర రూపాయుంటే, రెండని సరుకులుకొని, తన కంపెనీకి నష్టం చేసి, ఆ సొమ్ము జేబులో వేసుకున్న గంగాధరం చాకచక్యాన్ని కార్యదీక్షని, వ్యవహార దక్షతను మెచ్చుగుంటోంది సమాజం. ఈ సమా

జంలో గంగాధరంలా ఉండటమే మంచిదేమో. సమాజం కంటె, నీతి పరుడుగా ఉండటం మంచిదికాదన్నారెవరో.

తనని ఎవ్వరూ చూడలేదు. వెనకగా నిలబడి, తిరిగి కంపెనీ కొచ్చేశాడు రవిప్రకాశం.

మెల్లగా నడుస్తూ, తన గదిలోకొచ్చాడు. లోపల ఎవరో మాట్లాడుకుంటున్నారు. నవ్వులు, కేకలు వినబడ్డాయి. ఎవరబ్బా! ఇప్పుడు తన గదిలోకి వెళ్ళడం మంచిదికాదు. మెల్లగా వెనక్కి తిరిగి, పూలమొక్కల నడుమ ఫౌంటెన్ ప్రక్క నిలబడ్డాడు. నియాన్ దీపంచుట్టూ, కీటకాలు మూగి, వింత వింత రీతులలో ఎగురుతూ, వొక డిజైన్ ప్రదర్శించి నాట్యం చేస్తున్నాయి ఒక వ్యక్తి.... పాంట్, బుష్షర్టు.... వేసుకుని వెడుతున్నాడు. గేటు దాటాడు. అతన్ని గుర్తుపట్టాడు రవి. అతను రంజిత్ మరో నాలుగు నిముషాలయ్యాక, బాగ్ వూపుగుంటూ వొస్తోంది మాధవి. అతన్ని చూడగానే నిల్చిపోయింది.

"మీరా? ఎలా ఉందీపూట....? మీ ఇంటికే బైలుదేరాను. ఏం ఇలా వొచ్చారేం....?....అబ్బ మాట్లాడండి"

"బాగానే ఉంది. పొద్దోయింది. ఇంటికి వెళ్ళరాదూ.... కార్లో దింపమన్నా...?" అన్నాడు.

"మీతో మాట్లాడాలి—— మీ ఇంటికి రావొచ్చా?"

"ఇప్పుడు నేను, ఇంటికి వెళ్ళడంలేదు. కాస్తంత పని చూసుకోవాలి." అని రవిప్రకాశం తన గదివైపు వెళ్ళాడు. షర్టు బటన్స్ తీసేసి పంకా తిప్పి, రెండుకాళ్ళూ బల్లమీద ఆనించి కళ్ళు మూసుకుని పరున్నాడు ఐదు నిముషాలైంది. మాధవి మెల్లగా వొచ్చి, అతని కుర్చీ పక్కన, బల్లచివర కూర్చుంది. నుదుటిమీద ఉన్న అతని చేతిని తీసుకుంది. ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు.

"నన్ను క్షమించరూ.... నిన్న చేసిన దానికి...."

అతనేమీ మాట్లాడలేదు. కాళ్ళు దించి, బొత్తాములు తగుల్చుకుని, సర్దుకు కూర్చున్నాడు.

"క్షమించానంటే కాని వొదల్ను" అంది అతని చేతిమీద రాస్తూ.

"ఏమనాలో తెలీదు" అన్నాడు.

"అతనే, ఆ రంజిత్, ఏదో కబుర్లు పెడతాడు. రావొద్దంటే వినడు పొమ్మంటే పోడు సాయంత్రం నుండి కబుర్లు పెట్టాడు. గంగాధరంగారికి పార్టిట ఎవరెవరు ఎలా మాట్లాడుతారో, అందర్నీ ఇమిటేట్ చేసి చూపిస్తాడు.... అచ్చంగా గంగాధరం కంఠంలాగ పూరించి, ఆయన మాట్లాడినట్లే మాట్లాడతాడు తను నాటకం యాక్టర్‌ట. మిమ్మల్నీ ఇమిటేట్ చేస్తాడు.... నేనేం చెయ్యను చెప్పండి. నా ఉద్యోగం వూడుతుంది, నువ్విలా చేస్తే అన్నాను వూడితే మా కంపెనీలో ఇప్పిస్తాలే అంటాడు. ఇలా వేధించుకు తింటాడు. మరి క్షమించరూ?"

ఆమె నిజం చెప్తున్న కళ్ళ వైఖరికి రవి ఆశ్చర్యపడ్డాడు. కళ్ళల్లో నిజం, నీలి నీడలు ప్రసరిస్తుంది. అది అబద్ధానికి చేతకాదు. ఆమె పల్చటి ముక్కు, పెదవులు నడుమ తపనతో తిరుగాడే అమాయకత్వం, బుగ్గలపై, మంచు వెనక ఆకుపచ్చ పొదకదిలిన రీతి....ఆకుపచ్చ ఛాయ, కదిలి అదృశ్యమై కంఠం కదలికతో మెడ నాళాలలో దర్శనమివ్వటం, వింతగా గమనిస్తున్నాడు రవి.

"మార్చి మూడో తేదీని, నా కేదన్నా ట్రంక్ టెలిఫోన్ వొచ్చిన గుర్తుందా?" అని అడిగాడు.

"లేదండి....లేదని చెప్పాగా....అప్పుడోమారు అడిగారుగా...." అంది మాధవి కళ్ళు చిట్లిస్తూ.

"బాగా జ్ఞాపకం చేసుకో....మధ్యాహ్నం....సాయంత్రం....నాలుగు ఐదు,....ఆరు లోపు....బాగా జ్ఞాపకం చేసుకో....ఎక్స్‌చేంజ్‌ని వాకబు చేశాను. బొంబాయి నుండి ఫోన్‌కాల్ వొచ్చినట్లు వారి చిట్టాలో వుందన్నారు."

"ఎప్పుడబ్బా....రాలేదే...." అని తలదించి, బల్లమీద వేళ్ళతో గీస్తోంది మాధవి.

"అమ్మయ్యో ....అవునండి....ఇప్పుడు గుర్తుకొస్తోంది ఆరోజు సాయంత్రం....రంజిత వొచ్చి, కబుర్లు సాగించాడు, సినిమాకి రమ్మ

న్నాడు. రానన్నా. ఇక్కడే కూర్చుని, వాగడం....అందర్నీ ఇమిటేట్ చెయ్యడం....ఈలోగా టెలిఫోన్ చప్పుడైంది....మరెక్కడి నుంచో.... తనే తీసుకుని, మీరు మాట్లాడే మాదిరి అ, ఊ అల్లాగే....కానియ్యండి.... మీ రంటూ ఉంటారే అప్పుడప్పుడు....కానియ్యండని ....అల్లా ....ఏవో నాలుగైదు మాటలు....ఉ, ఆ....అవే జ్ఞాపకం...."

అని నిల్చిపోయింది. ఏదో ఆలోచనలలో పడ్డట్లు పరధ్యానంగా ఉంది.

"ఇది నీకు ఇప్పుడే జ్ఞాపకం వొచ్చిందా....ఇదివరకు తెలిసి మరిచి పోయి, మళ్ళా జ్ఞాపకం చేసుకున్నావా?" అని అడిగాడు.

తటపటాయించింది. లేచింది అతని వొళ్ళో తల ఆనించి, ఏడ్పు సాగించింది. ఆమె మొహాన్ని పైకెత్తి దూరంగా కూర్చోబెట్టి, ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"నాకు తెలుసు. తర్వాత చెప్పాడు. గంగాధరంగారు ఫోన్ చేశాడుట మీరు మాట్లాడినట్లే, ఆయన అడిగిన దానికి సరే అల్లానే కానీయండి....అన్నాడుట....తమాషాకిట. తర్వాత చెప్పాడు. మీతో చెప్పే ధైర్యంలేక చెప్పలేదు. నన్ను క్షమించరూ ....ఇంకెప్పుడూ ఇట్లా చెయ్యను...."

రవిప్రకాశం లేచాడు. ఆమె భుజంపైన చెయ్యివేసి ఓదారుస్తూ, "నిజం చెప్పావు నాకదే చాలు. నిజం చెప్పినవారు ఎంతో అందంగా కన బడతారు....నువ్వు ఎంతో అందంగా వున్నావు యీ క్షణంలో...." అని ఆమె నుదుటికి తన అధరాలు తగిల్చాడు. క్షణం, ఆదిమి పట్టింది మాధవి. ఇద్దరూ బైటికివొచ్చారు. కార్లో వెళ్ళమన్నాడు. నడచి వెడతాలెండి అని వెళ్ళిపోయింది మాధవి.

తను అనవసరంగా అనుమానించాడు గంగాధరంని. ఇతరుల చెడ్డతనాన్ని ఋజువు చెయ్యడానికి మనిషి ఎంత కుతూహల పడతాడు! ఎంత ఆతృత! పాపం, గంగాధరం, మార్కెట్ ధర ఎంతుందో ఫోన్ చేశాడు. సరే కొనమన్నాడు రంజిత్-తన కంఠంతో అతను కొన్నాడు.

మార్కెట్ ధర రూపాయే నని బొంబాయి స్నేహితుడు పంపిన

భోగట్టా సరైందికాదు. లేదీయో, వాస్తువో, ధరో....ఎందులోనో పొరబాటు పడివుండొచ్చు. వెళ్ళి గంగాధరాన్ని కౌగలించుకుని తను లోన ఏమనుకున్నదీ చెప్పివేసి, మాధవి మల్లే ఏడ్చేద్దామనిపిస్తోంది. అల్లా ఏడ్చి వేసి, లోపలి కుళ్ళుని, ద్వేషాన్ని కడిగివేస్తే మనుషులు ఎంత అందంగా ఉంటారు! మాధవి ఎంత అందంగా ఉంది! ఆమెని ముద్దు పెట్టుకోక తప్పింది కాదు! గంగాధరాన్ని కౌగలించుకోవాలి. అతనికేదో మేలు చెయ్యాలి: కృతజ్ఞత చెప్పుకోవాలి. తన అసూయని, ద్వేషాన్ని గుండె లోంచి బాకు లాగినట్లు, లాగెయ్యాలి. పార్టీలో అందరూ అతన్ని మెచ్చుగుంటున్నారు. తనూ వెళ్ళి, మెచ్చుగుంటూ ఉపన్యసిస్తే! ఏదో చెయ్యాలి. మనస్సు పీకుతోంది. కారు గంగాధరం పార్టీ ఆవరణవేపు పోనిమ్మన్నాడు రవి. అక్కడ నిల్చింది కారు. పార్టీ ఐపోయింది. అందరూ ఇళ్ళకి పోతున్నారు. కప్పులు. సాసర్లు తీస్తున్నారు. కుర్చీలు సర్దుతున్నారు.

మరో అవకాశం రాదా? కారు ఇంటికి పోనిమ్మన్నాడు రవి. అంతే జీవితం గుండె పగుల్తుంది. వినేవాళ్ళేరి!

ఆ అవకాశం, 'వారంలోనే వొచ్చింది. రవి, డాక్టర్ల సలహాపై కంపెనీకి వెళ్ళక, ఇంటివద్ద చికిత్సపొంది, విశ్రాంతి తీసుకుంటున్నాడు రవి. గంగాధరం, స్టెయిన్‌లెస్ స్టీల్ కొనడానికి బొంబాయెడుతున్నాను, మీ కంపెనీకి కూడా స్టయిన్ లెస్‌స్టీల్ కావాలికదా, బొంబాయి రాకూడదా ....అని తనే స్వయంగా వొచ్చి అడిగాడు. అవును తమ కంపెనీకి కూడా కొంత స్టెయిన్ లెస్‌స్టీల్ కావాలి. మేనేజిమెంట్ ఏడాది క్రితమే కొనడానికి అంగీకరించారు. బద్ధకించి తాను దాని విషయం పట్టించుకోలేదు. ఇప్పుడు ఆ అవకాశం వొచ్చింది. గంగాధరం రమ్మంటున్నాడు. అతనితో కలిసి వెడితే బాగుంటుంది. అతనితో కలిసి ఉండడంలో, తృప్తిశాంతి ఉన్నాయి. గంగాధరాన్ని శంకించాడు. ఎంత మంచివాడు. అతని ఖర్చు కూడా తనే భరిస్తేనేం? ఈ విశ్రాంతి చాలు అస్వస్థత అల్లా ఉంటూనే ఉంటుంది డాక్టర్లు ఉన్నంత కాలం. వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. డబ్బు తీసుకుని, ఇద్దరూ మర్నాడే బొంబాయి ప్రయాణమయ్యారు.

అక్కడ స్టెయిన్‌లెస్ స్టీల్ కొనేటందుకు ఇద్దరూ చెరో లైసెన్సూ కొన్నారు. మార్కెట్ ధర వాకబుచేశారు. కిలోగ్రామ్ ధర మారుతూ ఉంటుందట. రెండు రోజులు గమనిద్దామన్నాడు గంగాధరం. అతను వే ఇతర పనులు చూసుకుంటూంటే రవిప్రకాశం, తన స్నేహితుల్ని కలుసుగుని, వారితో ఒకరోజు గడిపాడు. హీరాలాల్‌తో కలిసి మరొకరోజు, చిత్రకళా ప్రదర్శనం చూస్తూ గడిపాడు. వైరూప్య చిత్రాలే చాలాభాగం ఆనాడు నియాన్‌లైట్ చుట్టూ మూగుతూ కీటకాలు ప్రదర్శించిన డిజైన్లం లాంటి బొమ్మలు కొన్ని— పెద్ద కాన్వాస్‌పై మధ్య నల్లసున్నా గీసిన బొమ్మ వొకటుంది. అంతరంగు వృధాచెయ్యడమే మరొకటి గోనిసంచి అతికించి దానిమీద ఇటుకపొడుం జిగురుతో అతికించిన చిత్రం. నగ్న స్త్రీ చిత్రాలు రెండుమూడున్నాయి.

వీటిల్లో ఏ బొమ్మలోనూ, కళ్ళు, ముక్కు, నోరు— ఏవీ స్ఫుటంగా కనబడవు. స్త్రీమూర్తులన్నింటికీ. కంతలు— చిన్నతల, పెద్ద తొడలు. వాటికి ముఖ్యంగా మొహాలకి ఆకుపచ్చరంగు ముద్దపెడుతున్నారు చిత్రకారులు ముక్కున్నచోట. మొహానికి ఆకుపచ్చ ఇప్పుడు ఫ్యాషన్ కాబోలు. మాధవి మొహంలో ఆకుపచ్చ ఛాయ తళుకు స్ఫురణకొస్తాయి. ఇట్లాంటి చిత్రాలు చూడడంవల్ల, ఆమె మొహంలో ఆకుపచ్చ కనబడుతుందా; ఏమో— చిత్రకారుడి కళ్ళద్వారా చూస్తాం మనం. అతను పర్వతాన్ని ఎలా చిత్రిస్తే, అసలు పర్వతం అలాగే కనబడుతుంది మనకి. ఒకటే కన్నుగల మూర్తిని చిత్రిస్తే, నిత్యజీవితంలో. రెండు కళ్ళు రోత పుట్టిస్తాయి కాబోలు. ప్రకృతిలో అందంలేదు. రంగులేదు— ఆకృతిలేదు. లయలేదు. ఎవరో అన్నట్లు, ప్రకృతిలో స్థూలంగా కనబడేది బూడిద రంగు. చిత్రకారుడి ప్రకృతినే చూస్తాం మనం. ఎర్ర కృష్ణుణ్ని ఏ గోపిక ప్రేమిస్తుంది?

రవిప్రకాశం వొళ్ళు తిరిగినట్లయింది. తల భారంగా ఉంది. పాదాల కింద నేల బీటలు తీస్తున్నట్లుంది. మిత్రుడు హీరాలాల్ తన గదికి తీసికెళ్ళాడు. డాక్టర్ని పిలిచాడు. ఆయన మందులిచ్చి బాగా ఒకనెల రోజులి

పాటు, చల్లటి ప్రాంతానికెళ్ళి విశ్రాంతి తీసుకోమని సలహాయిచ్చాడు. ఈ డాక్టర్లంతా యింతే. రోగి ఇంతవున్నవాడని తెలియగానే, ఎక్కడికో వెళ్ళి రెస్టుతీసుకోమంటుంటారు. అమెరికాలో ఇంతే. ఒక్కరోజు కూడా విశ్రాంతిలేకుండా పనిచేస్తారు అక్కడ అంతడబ్బు, తాపత్రయం. తొందర్లోనే వారి శరీరాలు బీటలువారి పనికి రాకుండా పోతాయి విశ్రాంతి తీసుకోమంటారు ఏం విశ్రాంతి? చచ్చాక అంతా విశ్రాంతే. హీరాలాల్, కాశ్మీర్ రమ్మని ఆహ్వానించాడు. అక్కడ అతనికి ప్రచార శాఖలో ఉద్యోగం. ఇప్పుడు శ్రీనగర్ రోడ్డు బాగైంది. ప్రయాణ సదుపాయాలు నేను చూసుకుంటాను, రావల్సిందిగా పట్టుబట్టాడు హీరాలాల్. మేనేజ్‌మెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఒకనెల శెలవు కోరాడు రవిప్రకాశం. వాళ్ళు సరే నన్నారు. తన పనిని భూషణంకి వప్పగిస్తాం. నీకు సమ్మతమేనా అన్నారు. సరేనన్నాడు. ఈ విషయం తెలుపుతూ భార్యకి ఉత్తరం వ్రాశాడు. మర్నాడు తనూ గంగాధరం వుంటున్న గదికి తీసుకొచ్చాడు హీరాలాల్.

సాయంత్రం నాలుగైంది. అప్పుడే ముస్తాబై బైటికి వెళ్ళబోతున్నాడు గంగాధరం.

"విన్నల్లా ఏమయ్యావు? గుహలో కాగడా వేస్తున్నావా?" అని అడిగాడు.

"అంటే?"

"ఆమాత్రం తెలీనట్లు నటిస్తావేం? నాలుగురోజులుండి పొయ్యే బిజినెస మెన్‌కోసం, గుహలు కట్టారుగా-లైసెన్సు పుచ్చుగున్న గుహలేలే." అని నవ్వుతూ మీసాల నడుమ పళ్ళు ప్రదర్శించాడు గంగాధరం.

"ఓ అదా——ఈ స్థితిలో, ఈ వయస్సులోనా?"

"ముఖ్యంగా ఈ వయస్సులోనే.... అహాహహా...." అని ఇంకా నవ్వుతున్నాడు.

రవిప్రకాశం తన స్థితిఅంతా చెప్పాడు. ఒంట్లో బాగా లేకపోవడం, వైద్యం, విశ్రాంతి తీసుకునే సంకల్పం, కాశ్మీర్ ప్రయాణం, హీరాలాల్ ఆహ్వానం, తను శెలవుపొందిన సంగతి—— అన్నీ చెప్పాడు.

"రెస్టు. అవును. నీకు బాగా రెస్టు అవసరం. ముఖ్యంగా.... మాధవి నుండి రెస్టు కావాలి నీకు."

రవికి కోపం వొచ్చింది. అంత పచ్చిగా, దురుసుగా మాటాడితే అతను హర్షించడు.

"పోనీ....ఆమెకు నీనుండి రెస్టుకావాలి. సరేనా?"....

రవి వొళ్ళు మండిపోయింది. ఈ గంగాధరాన్ని తాను కౌగలించుకోవాలనుకున్నది; ఇతనిముందు తన మనసు విప్పి, అంతా చెప్పివేసి, ఏడవాలనిపించిందా! ఈ బొంబాయి లైసెన్స్ గుహలలో కాగడావేసే, యీ ఏకపత్నీవ్రతుడిపైననా తన ఔదార్యం, కారుణ్యం, పశ్చాత్తాపంతో గుండె బేజారై పగిలినప్పుడు, వినడానికి రమ్మని ఆహ్వానించినది యీ వ్యక్తినా!

"ఎల్లాఉంది...."

"ఇప్పుడు బాగానే ఉంది."

"అది కాదోయ్.... మాధవి."

"ఓ."

"మా రంజిత్‌ని చేసుకోమని వెంటబడి చంపుకు తింటోంది. ఏముంగని వాళ్ళకి.... ముష్టి సంబంధం, పాకం ముదరకముందే, పంపించి వేశాను...." అన్నాడు గంగాధరం.

ఏమనాలో తెలియదు. ఏ ఉద్రేకమూ చూపకుండా, సంస్కారంతో వొచ్చే స్వారస్యం లేకుండా, వొక యంత్రంలా పలుకుతాడు గంగాధరం. అది తనకి సాధ్యమైతే ఎంత బాగుండును! కంపెనీ వృద్ధిలో కొచ్చును. బోనస్ ఇద్దరు. తనని పొగుడుతూ ఉపన్యాసాలిద్దురు. తన పలుకుబడి, హోదా, పెరుగును. తనొక ప్రముఖ వ్యక్తవును. ఈ సమాజానికి శత్రువు సంస్కారం, కాని సంస్కారం తన ఎముకలలో జీర్ణించిపోయింది. దాన్ని వొదుల్చుకోలేడు. ఆస్తిపంజరం నుండి పారిపోలేడు.

"బైదివే.... కాశ్మీర్‌లో మాధవి అన్నగారున్నాడు తెలుసుగా. నాకో డజను కాశ్మీర్ శాలువలు తెచ్చిపెట్టేం...."

డజను కావాలి. వొకటి రెండు చాలవు. ఎంత స్వార్థం, ఎంత ఆశ!

"తరువాత అడ్జెస్ట్ చేసుకుందాం....!"

"చూడు, ఆ కోటుజేబులో, లోపల, పాకెట్‌లో లైసెన్స్, చెక్ వున్నాయి. తీసుగుని మా నరుకుకూడా కొని పంపించు," అన్నాడు రవి ప్రకాశం.

గదిలోమూలగా ఉన్న కోటులో గంగాధరం చెయ్యి పెట్టి వెతుకుతుండగా అటు తిరిగి రవిప్రకాశం కళ్ళుమూసుగుని పడున్నాడు. కాసేపటికి, తేరుకుని లేచాడు. మొహాన నీళ్ళు జల్లుకున్నాడు. సామాను సర్దుకుని చిత్రలేఖనం పరికరాలు పోస్టర్లు, శిల్పంకి కావల్సిన సామాను కొనుక్కొని, హీరాలాల్ గదికెళ్ళి, ఆ మర్నాడు పఠాన్‌కోట్‌కు, హీరాలాల్‌తో కలిసి ప్రయాణమయ్యాడు స్టేషనులో వీడ్కోలివ్వడానికి గంగాధరంకి తీరక, అతనితో కలిసొచ్చిన సోమయ్యని పంపాడు రైలు కదుల్తుంటే చెప్పాడు సోమయ్య స్టెయిన్‌లెస్ స్టీల్‌టన్ను పదివేలన్నట్లు!

పఠాన్‌కోటనుండి జమ్మూ పట్నానికి అరవై ఏడుమైళ్ళ దూరం. బస్సులో సాయంత్రానికి జమ్మూ చేరుకుని ఆ రాత్రి హోటల్లో గడిపి మర్నాడు ఉదయం తొమ్మిదింటికి బస్సులో శ్రీనగర్‌కి బయలుదేరారు, రవిప్రకాశం హీరాలాల్. అది రెండువందల మైళ్ళ ప్రయాణం. బాట అంతా కొండలపైననే. వకొక్కచోట ఐదువేల అడుగుల ఎత్తు గల కొండ బాటలో నడుస్తుంది బస్సు. కుడివైపున మరొక ఎత్తయిన కొండగోడ వర్షపునీరు వృద్ధ కొండదేవత నెరిసినజుట్టు విప్పి ఆరవేసినట్లుగా సన్న ధారగా పైనుంచి జారుతూ ఉంటుంది. ఎడమవైపుకి తలతిప్పి వంగి చూస్తే అడుగున జీలంనది రాళ్ళ మధ్యగా రంగురంగులతో మెరుస్తూ కదిలిపోతూ ఉంటుంది. దాని బాట బ్రహ్మదేవుడి రక్తనాళం, దాని ధ్వని శివుడిని కామించిన పార్వతి పిలుపు ప్రతిధ్వని. రాని ప్రియుడికోసం పరితపించి రవికవిప్పేసి ఆకాశం క్రింద విరహబాధతో రోదిస్తున్న విశ్వకన్యల స్తనాలు ఆ కొండ శిఖరాలు ఏనాడో సిగ్గుపడి కాముడు మంచుతెర తెల్లచీరగా వాటి వక్షాలని కప్పుతాడు. తపనతో వాటిని తొలగించి గుండెలు

దాదుకొనే పిడుగులు పడగా చీరమడత నదిలో పారేసి నగ్నంగా పడి ఉంటారు విశ్వకన్యలు. బహిష్టకాగానే విడిచి పారేసిన ఆ చీర ద్రౌపదికి కృష్ణుడిచ్చిన చీరకిమల్లే అనంతంగా కొండ నడుంని చుట్టబెట్టే అనంతమైన చీరగా సాగిపోతుంది ఆ జీలంనది ఇక్కడ పిఱుదపై ఎఱుపురంగు అక్కడ అదృశ్యం. అక్కడ బొడ్డుపై చిరుగు; అదొక సుడిగుండం, మళ్లా అదృశ్యం. అక్కడ వక్షాన్నిబట్టి, పీకి, చుట్టూతిరుగుతూ పట్టువిడిచేసి వేగానికి క్రిందికి పడిపోయిన దృశ్యం, అగ్రృశ్యం. కొంతదూరం వెళ్ళాక పీక చుట్టూ ముడిపడి పీక నులిమినట్లు "అమ్మో" అన్న కేక ప్రతిధ్వని చెవలకి సోకకుండా అఘాతంలోకి, దూకిన దృశ్యం, అదృశ్యం. ఎక్కడెక్కడో—మరొక్కచోట తోటి కన్యతో చుట్టూ వట్టాలు -రెండు చీరలు ఆరవేసిన దృశ్యం, అదృశ్యం; రెంటినీ కుట్టి తనే ధరించి సైజు పెద్దదై తానందులో కూరుకొని మరి కనబడక ఉంగగా దొర్లుకుంటూ సాగారిన దృశ్యం, అదృశ్యం. విసుగెత్తి ఉక్కబోసి వూపిరి ఆడక నాచుతో పచ్చబడిన వస్త్రాన్ని కొండగట్టు మీద పారేసి విశ్వేచీగా, నగ్నంగా రాళ్ళను మంచి చేసుకుంటూ చదును నేలను బుజ్జగిస్తూ మరి కదలక ప్రశాంతంగా పవ్వళించిన ఆ జీలంనది వైవిధ్య సౌందర్యం చూడగలిగినవి మానవుడి నేత్రాలు. ఎంతటి సౌందర్యాన్నీ దాచుకొన్న కళ్ళని మూసుకొని ఒక్కసారి చూడగలిగాడు రవిప్రకాశం. దోవలో "చాటోట్" అనేచోటరొట్టెలు, "రాంబాన్" అనేచోట టీ, ఆరాత్రి "బనిహాల్" బంగళాలో ముకాం మరునాడు ఉదయం సుమారు ఆరువేల అడుగుల ఎత్తుగల కొండపై జవహర్ సొరంగంగుండా పోతుంది బస్సు అక్కడ తొమ్మిదివేల అడుగులఎత్తు ఆరువందలయాభై అడుగుల పొడుగుగల సొరంగం, లోపల పసుపుపచ్చ దీపాలు, ఆకుపచ్చ, ఎరుపు రంగులు మోహాన్న వెదజల్లినట్లు మనిషి రక్తంలోరంగు కలిపినట్లు విశ్వంలో తిరుగాడి చచ్చి శిథిలమైన ప్రాచీన తారకల కళేబరాలు ఆ సొరంగంలో కుదించినట్లు వింతవింత రంగుల దృశ్యాలు, నైరూప్య కళ చరమదశకి చిహ్నం. చిత్రకారుడి గుండెపగిలే

చోటది. గుండె పగిలిన శబ్దం; ప్రతిధ్వనిని శ్వాసగా పీలుస్తూ సజీవమైన కొండ గుహ.

సాయంత్రానికి శ్రీనగర్ చేరుకున్నారు. ఐరిష్‌కవి, "థామస్ మూర్" రచించిన "లల్లారూఖ్" అనే కావ్యంలో భాగం, ఎప్పుడో చదువు కొన్నది జ్ఞాపకం వచ్చింది రవిప్రకాశంకి. ఆ కావ్యంలో బుఖారియా రాజు "అలీరిస్" కథానాయకుడు. ఇల్లా అంటాడు.

"కాశ్మీర్ లోయను గురించి విన్నావుగా
భూదేవి తెచ్చిన గులాబులు
ఆలయాలు, ఊటలు, చలమలు
వాటి అలలపై ప్రేమతో మెరిసి
పొంచి చూసే నేత్రాలు వెదజల్లే
చల్లదనపు నీడల నడుమ వర్ధిల్లే
కాశ్మీర్ లోయని ఎరుగున్నావుగా నేను."

శ్రీనగర్ చేరుకున్నారు. ఆ రాత్రి ఒక పడవని కుదిర్చిపెట్టి ఇంగ్లీషు మాట్లాడే "కాదిర్" అనే వ్యక్తిని సహాయంగా పెట్టి హీరాలాల్ తన పనిలోకి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి విశ్రమించి మర్నాడు కాదిర్‌ని తీసుకొని కాశ్మీర్ దృశ్యాలను చూడటానికి బయలుదేరాడు రవి.

బారామూలా ప్రాంతంలో ఒక కొండ ఉండేది. అక్కడ ఒక రాక్షసుడు ఉండేవాడు. వాడిని సంహరించి ఆ కొండ నడుమ ఖాళీచేసి దాని గుండా ఒక పెద్ద చెరువులో నీటిని ప్రవహింపజేసి ఆ లోయ నివాస యోగ్యంగా చేశాడుట కశ్యపుడు. అందుకనే ఆ లోయని "కశ్యప్‌మార్" అని వ్యవహరించేవారు. రాను రాను అది కాశ్మీర్ ఐంది. అనాదిగా భారత దేశంలో ఒక భాగం కాశ్మీర్. క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దంలో కాశ్మీరులో అశోకుడు బౌద్ధాన్ని నెలకొల్పాడు. ఎన్నో యుగాలుగా హిందూ, బౌద్ధ సాంప్రదాయాలు వర్ధిల్లాయి ఎనిమిదవ శతాబ్దంలో లలితాదిత్య చక్రవర్తి మార్తాండ ఆలయాన్ని కట్టించాడు, పదిహేనువందల ఎనభై ఆరులో కాశ్మీరాన్ని జయించాడు అక్బర్ చక్రవర్తి మొఘల్ చక్రవర్తులు, జహంగీర్, షాజహాన్‌లు, డాల్ సరస్సుచుట్టూ ఎన్నో ఉద్యానవనాలు నిర్మిం

దారు. నీ చివరికోర్కె ఏమిటి? అని జహంగీర్‌ని అంతిమ ఘడియల్లో అడిగినప్పుడు "నాక్కావల్సింది కాశ్మీరమే. ఇంకేమీ అక్కర్లేదు." అన్నా డుట.

కాశ్మీర్ ప్రచార శాఖవారు ప్రచురించిన పుస్తకాలలో కాశ్మీరును గురించి యీ—వివరాలు చదువుకున్నాడు రవిప్రకాశం. వెయ్యి అడుగుల ఎత్తయిన శంకరాచార్యుని కొండ ఎక్కాడు ఇక్కడ శివాలయం ఉంది. అశోకుని కుమారుడు జాలకుడు కట్టించాడు శిధిలమైన దానిని లలితా దిత్యుడు బాగుచేయించాడు. దూరంగా మరొక కొండ హరిపర్వతం. ఈ రెంటినీ చుట్టుకొంటూ ప్రవహిస్తుంది జీలంనది. దానిపైన తొమ్మిదివంతె నలు. ఇంకా దూరంగా మొఘల్ ఉద్యానవనాలు, డాల్ సరస్సుపై తేలి యాడే తోటలు.

ఒకరోజు పహల్‌గామ్‌లో గడిపాడు రవి. శ్రీనగర్‌కి అరవై మైళ్ళ దూరంలో, లిద్దర్‌లోయలో ఉంది పహల్‌గామ్.

దోవలో అనంతనాగ్‌లో ఉదకజలాలు, మార్తాండ్‌లో ప్రాచీన శిధి లాలు చూశాడు. పహల్‌గామ్ దగ్గరలో పర్వతాలపై సంచారం చేశాడు. చుట్టూ హిమవత్పర్వతాలే—తెల్ల టోపీలు మొహంమీదికి లాక్కున్న అనుచరులకి మల్లే. మనిషి తాకిడి ఎరగని పవిత్రతని శాలువాలుగా కప్పు కున్న కన్యలు, చెయ్యిచెయ్యిపట్టుగుని ఆటలాడుతూ, నిలిచిపోయిన భంగి మంకి మల్లే, శేషనాగ్, అమరనాథగుహ, కోలోహోయ్‌లో క్రిందికిజారే మంచు నదులు—ఇవీ తనూ ఒకే లోకంలో వాళ్ళమా అనుకున్నాడు రవి ప్రకాశం. అంతటా మంచు—మంచు—ఇంకా మంచు—మంచు శిఖరం— తెల్లవి, పచ్చవి, నీలంవి, ఎర్రవి, ఊదావి—సూర్యరశ్మితో చలగాటం ఆడే రంగుల నీడల వొయ్యారపు హొయలు. అక్కడి మనుషులు సము ద్రం ఎట్లా ఉంటుందో వర్ణించమన్నారు. వారు సముద్రం చూడలేదట. ఇక్కడివారు మంచు శిఖరం ఎరుగరు. ఒకనాడు—ఆదిలో—ఈ శిఖరాలే సముద్రం—సముద్రమే శిఖరాలు.

తన పడవ గృహానికొచ్చేశాడు రవిప్రకాశం. అందులో మూడు గదులు. ముందుది డ్రాయింగ్‌రూమ్. సోఫాసెట్, రెండు కుర్చీలు

ఉన్నాయి. వెనక గది భోజనాలకి. చివరది పడక గది. పడవవాడు ప్రేమ్ చంద్. అతను, భార్య, పిల్లలు, వెనక పడవలో ఉంటారు. కావాల్సిన పదార్థాలు వండి, ఇందులోకి తెచ్చి వడ్డిస్తారు. ప్రేమ్‌చంద్ టోపీ ధరిస్తాడు—సగం సగం ఎదిగిన మీసకట్టు, నాలుగైదు బనీన్లపై కోటు, పైన వెడల్పుగా, లుంగీలా చుట్టి, కింద సన్నగా మడమని అంటిపెట్టుకునే లాగు. మనిషి నలుపు. చిన్న కళ్ళు—రంగురంగుల పళ్ళవరుస. భార్య కనబడదు ఎప్పుడన్నా పడవ వెనక నిలబడ్డప్పుడే దర్శనం. ఎర్రజుట్టు—చిన్ని కళ్ళు, వెడల్పు దవడలు, చదరంగా కనపడే గడ్డం-పై నుండి పాదాలవరకూ, రంగురంగుల గుడ్డలతో కుట్టిన గౌను ఎరుపు ప్రధానమైన రంగు. చెవులకు బరువైన లోలాకులు—చేతులకు వెడల్పైన గాజులు—నవ్వు మొహం. భాషా భేదాలూ లేవు. .... ఉద్రేకంలేని ప్రాణులు.

ఆ ఉదయం షికారాలో వెడుతుంటే, ఎవరో పేరెట్టి పిల్చారు. పలకరించారు. చూశాడు ఆ షికారా నిల్చింది. అందులో వ్యక్తి హరికృష్ణ—మాధవి అన్నగారు. గుర్తుపట్టాడు. రండి మా అక్కయ్యని చూద్దాం అన్నాడు. షికారా తిప్పారు. రెండు ఫర్లాంగులు వెళ్ళాక ఒడ్డున దిగారు. అక్కడ మరో కాలవ మలుపు తిరిగింది, ఆ చిన్న కాలవ మలుపులో వొక పడవ గృహం ఉంది. అందులో కెళ్ళారు. అప్పుడే స్నానం చేసి జడల్లుకుంటో, సోఫాలో అద్దం ముందు కూర్చుని వుంది మాధవి. పడవవాడితో ఏదో అన్నారు. వాడు టీ, బ్రెడ్ తెచ్చాడు.

'మీరెప్పుడొచ్చారు....?"

"నాలుగైదు రోజులైంది"

"నేనొచ్చి వారమైంది హరి వొచ్చి తీసుకొచ్చాడు. ఎరుగుదురా హరిని"....

"అవునవును"

"మీరు బాగా చిక్కిపొయ్యారు. మా దగ్గరే ఉండాలి అన్నీ మేం చూస్తాం. అన్నయ్యకి కాశ్మీర్ కొట్టినపిండి—" అంది మాధవి.

అతన్ని అక్కడే ఉండిపొమ్మన్నారు ఆ పడవగృహం ఇక్కడికే

పట్టిస్తామన్నారు. అక్కడే భోజనాలయ్యాయి. ఆ మధ్యాహ్నము విషాట్ బాగ్ తోట కెళ్ళారు. నూర్‌జహాన్ సోదరుడు అసఫ్ ఖాన్ వేయించిన తోట అది. పదిమెట్ల కింద, పర్వతం నుండి జారే ఉద్యానవనం. పై నుంచి చూస్తే డాల్ సరస్సు కనబడుతుంది. నడుమ జలం, పాయలు పాయలుగా, చిన్న జలపాతాలుగా జారుతూ ఉంటుంది. ఎందరో జనం. నల్లబురఖాలు, తెల్లబురఖాలు-అందులో చూచేందుకు రెండు కంతలు. ఆకుపచ్చరంగు ఫిరానా ధరించినవారు, కాబూల్ నుండి వొచ్చారు. తల చుట్టూ పాగా ధరించిన పిల్ల కాశ్మీరంది. పాష్మినా శాలువలు కప్పుగున్న వారు ఆఫ్గన్లు, టీ త్రాగి ముక్కాల నడుమ ఒక మూలగా కూర్చున్నారు. మాధవి ప్రశ్నలకి సమాధానంగా, హరికృష్ణ తన కథ చెప్పడం సాగించాడు. అతనివి పెద్ద కళ్ళు, మంచి పళ్ళ వరస, సన్నటి పొడుగాటి ముక్కు చివరలో కొంచం వంకర తిరిగింది. ఎగదువ్విన క్రాపింగ్‌పై, ఫర్ టోపీ ఊదారంగు కాశ్మీరం కోటు, పిజామా—వింతగా ఆ వాతావరణంలో ఇమిడిపోయి, తెలుగువాడిలా కనబడడు. మాధవికూడా. అక్కడవారి దుస్తులు ధరించింది. మోచేతికి మీదకి దిగిన జుబ్బా, చేతుల-చివర నగిషీలేసు. త్రికోణం కట్టింగ్ మెడ—చుట్టు జిగిణీ—జాకెట్ నడుంమీదికి దిగింది. పైన పావడా; జుట్టుమీద తిప్పి దిగవిడిచిన శాలువ — తెల్ల సిల్కు పైజామా — పాదాలదగ్గర పడ్డ మడతలమీద నగిషీ జల్తారు. పాపిట నడుమ కుంకుమ — పుష్ప విశేషం, వంగ పండు, ఇంద్ర ధనుస్సు— కలువ, తుప్పపండు జల్దరుపండు ఆ ప్రాంతంలో కనబడే వాటిల్లో కలిసిపోయి, మాధవి వొక పుష్పంగా, ఫలంగా మారిపోయింది. వెనక పైకిలేచిన శిఖరం అంచుల్లో పెద్ద పెద్ద దేవదారు వృక్షాలు దూరంగా చూస్తే మంచు శిఖరాలు— అక్కడ పాదాల దగ్గర, అల్పమైన మనుషులు— పుష్పంగా మారిపోయిన మాధవి. రవి మనస్సు ఎలాగో ఐపోయింది తన వ్యక్తిత్వపుస్వరూపాన్ని మరచిపోతున్నాడు. హరికృష్ణ కథ వినలేకపోతున్నాడు. తనూ, కంపెనీ, గంగాధరం. స్టెయిన్

లెన్స్ స్టిల్ అన్నీ దూరమైపోతున్నాయి. అవి గతంలో నీడలు ఇక్కడ ఇది వెలుగు. అన్ని ఇంద్రియాలూ ఒక్కసారి సజీవమై తారతమ్యం, విచక్షణ, ద్వంద్వాల విభిన్నత ఎరగక, సౌందర్యాన్ని అన్వేషించి తెలుసుగుని, పట్టుగుని, గుండెకి హత్తుగుని రాళ్ళుగా మారిపోయిన మనుషులు.

ఇంక హరికృష్ణ కథ.

“స్మితిజోరా”, ఆమె మామయ్య, దేశ విభజన జరిగిన రోజుల్లో పాకిస్తాన్ ప్రాంతంనుండి వొచ్చేసి, కొంతకాలం బారామూలాలోనూ, మరి కొంతకాలం లడక్‌లోనూ ఉండి, తుదకు శ్రీనగర్‌లో షికారా పడవలు కట్టుగుని, అద్దెలకిచ్చి తిప్పుతూ గడుపుకుంటున్నారు. కొన్నాళ్ళకి మామయ్య చచిపొయ్యాడు. స్నేహితురాంద్ర సహాయంతో పడవలోనే ఉంటూ, పడవల్ని అద్దెలకిచ్చి ఉంటున్న సమయంలో అమర నారాయణ అనే తివాసీల పనివాడితో స్నేహం ఏర్పరచుకొంది స్మితిజోరా. అతనే ఆమెను ఆదుకున్నాడు. అప్పుడే హరికృష్ణ అమరనారాయణ కలిసి, తివాసీలు, శాలువలు తయారుచేసే పరిశ్రమ నిర్వహించి మంచి లాభాలు పొందారు. స్మితిజోరా, హరికృష్ణని అప్యాయతతో చూసేది. అతన్నే ప్రేమించింది. అమరనారాయణకి, ఇతనికి అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి. ఒక రాత్రి, సరుకంతా లారీలమీద కెక్కించి లడక్ ప్రాంతానికి వెళ్ళిపొయ్యాడు. దానితో హరికృష్ణకి ఏమీ మిగలకుండా పోయింది. హరికృష్ణ, స్మితిజోరా ఆరాలుతీసి, వెదకివెదకి అమరనాయణ్ ఎక్కడున్నదీ తెలుసుకున్నారు, బెదిరించి, జగడమాడక, తిరిగి శ్రీనగర్ రావల్సిందిగా బ్రతిమలాడారు. అతను సరే నన్నాడు. మళ్ళా కలుసుగున్నందుకు వినోదించాలన్నాడు. ఊలార్ సరస్సులో షికారాలో వెడదామన్నాడు. డజనుబుడ్లు జిన్, విస్కీ—తెచ్చాడు. జీలమ్‌నది—ఊలార్ సరస్సులోకి ప్రవహిస్తుంది. పదిహేనుమైళ్ళ పొడవైన విశాలమైన సరస్సు. మధ్యాహ్నానికి సరస్సులోకి చేరుకున్నారు. గట్టుకి రెండు ఫర్లాంగుల దూరంలో పడవ నిలిపారు. స్మితిజోరా ఏ పానీయమూ ముట్టలేదు.

అమరనారాయణ్‌ని తృప్తిపరచడానికి, సీసా చేతిలోకి తీసుకుని అటూయిటూ చూసి నీళ్ళలో పారబోసేది. స్నేహితులిరువురూ బాగా

త్రాగేశారు. అమరనారాయణ్ పాటలు మొదలెట్టాడు. స్మితిజోరా, వెనుక గదిలో వెన్నువాల్చింది. హరికృష్ణ మైకంతో కళ్ళుమూశాడు.

అమరనారాయణ్ పడవకి బెజ్జంపెట్టాడు. పడవ నడపడం సాగించాడు. ఆ సరస్సులో మధ్యాహ్న సమయంలో పెద్ద పెద్ద గాలులు వీస్తాయి. చిన్న పడవలు తట్టుకోలేవు. పెద్ద గాలి ప్రారంభమైంది. సరస్సు మధ్యకి వెళ్ళవల్సిన పడవ, వొడ్డుకి వెడుతోంది. బెజ్జంగుండా పడవలోకి నీళ్ళొస్తున్నాయి. అమరనాయణ దూకేశాడు. అతను మంచి ఈతగాడు. ఒడ్డుకి చేరుకున్నాడు. స్మితిజోరా నీళ్ళు రావడం, గాలి వీయడం గమనించింది బెజ్జంని మూయడానికి చెయ్యిపోనిచ్చి, నీటిని రానీకుండా ఆపుజేస్తూ, హరికృష్ణని కేకేసింది.

జిజ్ఞాసతో, సందర్భంతెలుసుకున్న హరికృష్ణ బేజారెత్తిపొయ్యాడు. గాలి పడవని తోసేస్తోంది. పక్కకి వొంగినవుడల్లా, మరికొంత నీరు లోపలికొచ్చి పడుతోంది. వొడ్డు ఎంతో దూరంలేదు. పడవ మునిగిపోయింది. స్మితిజోరా నీళ్ళలో పడిపోయింది. ఆమెని పట్టుగోడంకోసం హరికృష్ణ మునిగి తేలుతూ, ఎంతో నీరు త్రాగి, తన్నుకులాడి, ఆమె శరీరాన్ని పట్టుగుని పావుగంటలో ఒడ్డుకి చేరాడు. ఆమె తెలివిరాక పడిపోయింది. ఇద్దరు ముగ్గురు పడవవాళ్ళ సహాయంతో ఆమెని ఒక గుహలోకి చేరవేశాడు. సపర్యలు చేశాడు మూడోనాడు ఆమె చనిపోయింది, ఆమె పడవ గృహంలో, ఎన్నెన్నో తివాసీలు, శాలువలు భద్రంగా పెట్టెల్లో దాచింది. ఆ వస్తువులతో తాను మళ్ళా వ్యాపారం కొనసాగించాలి.

ఈ వృత్తాంతం చెప్పి కంటతడి బెట్టుకున్నాడు హరికృష్ణ. ఈ వ్యక్తిలో ఇంతటి ఉద్రేకం ఉంది, ఇన్ని విచిత్రమైన అనుభవాలకు గురైనందుకు ఆశ్చర్యపడ్డాడు రవి ప్రకాశం.

"ఇంటి కొచ్చెయ్యి— అక్కడ ఏదన్నా చూడొచ్చు" అన్నాడు,

"ఇక్కడ అలవాటైంది. ఆమె చాలా దూరదృష్టిగలది. వందకిపైగా పెద్ద తివాసీలు స్నేహితుల గోడౌన్స్‌లో పెట్టించింది— ఆమె ఎరుగును కాబోలు అమరనారాయణ స్వభావం. తన పడవలో రెండు

మూడు పెట్టెలలో శాలువలున్నాయి. లెక్కలు తెమలక ఆమధ్య నేనూ అతనూ చచ్చాం. అవన్నీ నేనే తస్కరించా ననుకున్నాడు నారాయణ, అతని ప్రేయసితోబాటు సరుకుని కూడా. అందుకే అంత దురంతానికి వొడిగట్టాడు." అన్నాడు హరికృష్ణ.

సాయంత్రం ఇంటి కొచ్చారు. తర్వాత కనిపిస్తానని. తన పడవ కొచ్చేశాడు రవిప్రకాశం.

ఆరోనాడు, అందరూ గుల్‌మార్గ్ బైలుదేరారు— కాదిర్, హీరాలాల్, మాధవి, హరికృష్ణ, స్మితిజోరా స్నేహితురాలు— పడవయజమాని చెల్లెలు— "ప్రీతమ్" అనే ఆమె— రవి అందరూ, కారు దిగాక గుఱ్ఱాలు అమర్చుకున్నారు. గుఱ్ఱం నడిపించేవాడు ముందు నిలబడ్డాడు. స్త్రీ లెక్కిన గుఱ్ఱంకి, ఇద్దరుంటారు, ముందొకడు, వెనకొకడు గుల్‌మార్గ్, మెరిసే ఆకుపచ్చ బయళ్ళతో, దూరంగా వొంకరగా దిగిపోయ్యే కొండలతో పెద్ద పెద్ద చీనార్ చెట్లతో— స్టడీ ఇన్ ఎమరల్డ్— (Study in Emerald) లాగ ఉంటుంది. చిత్రకారుడి స్వర్గం. రవి రెండుమూడు కలర్ స్కెచెస్ వేశాడు. గుర్రాలమీద అందరూ ఫొటోలు తీసుకున్నారు. పచ్చిక బైలులో కుర్చీలు వేసుకుని టీలు త్రాగారు. ప్రీతమ్, హరికృష్ణ ప్రక్కనే కూర్చుంటుంది. అతనితోనే మాట్లాడుతుంది.

"ఈమె డోగ్రి జానపద గీతాలు పాడుతుంది— పడవ పాటలు-" అని హరికృష్ణ ఆమెతో ఏదో అన్నాడు. ఆమె పాడడం ప్రారంభించింది. పల్చటి మనిషి— ఆ వింత దుస్తుల్లో స్థూలంగా కనబడుతుంది. బాగా పసిమి— డల్ గోల్డ్, పెద్ద బుగ్గలు— కళ్ళు సన్నమైనా, పొడుగ్గా చేపలల్లె ఉన్నాయి. వెల్వెట్ కోటు లోపల వక్షం చదునుగా కనబడుతోంది. ముక్కుకి ఏదో గుండ్రటి అలంకారం. బొట్టులేదు. నుదిటిమీద జుట్టు వెనక్కి తోసేసి, చుట్టూ వెడల్పాటి రిబ్బన్ కట్టింది. పళ్ళు రెండుమూడు వంకర. ముక్కు రంధ్రాలు కనబడే వొంపు కాసేపయ్యాక హరికృష్ణ ఆ పాటకి లయగా ఎగరడం మొదలెట్టాడు. ఫోటోలు తీశారు. వింతగా ఉంది. బుడ్డితీసి అందరూ తాగుతున్నారు.

"మీరూ తాగండి" అంటోంది మాధవి, తాను త్రాగుతూ. రవి

ఆశ్చర్యపడ్డాడు. భయపడుతూ మతిమరపుతో ఏమి మాట్లాడాలో తెలియని అమాయకురాలు మాధవి; ఈ రెండు మూడు నెలల్లోనూ ఎంత మారి మారిపోయింది! త్రాగేస్తోంది. చురుకుగా మాట్లాడగలుగుతోంది. ఆనాటిసిగ్గు, మందగొండి తనం— అన్నీ పొయ్యాయి. కొత్త చలాకీ, హుషారు. ఆరిందాతనం అబ్బేయి. వాతావరణమా? తాను ఎదుగుతోందా? కొత్త అనుభవం పొందిందా? లేక తాను అస్వస్థతగా ఉండడంవల్ల ఆమె అలా కనబడుతోందా?

మళ్ళా గుర్రాలు నడుపుకుంటూ పైకి ఖిలిన్ మార్గ్ వైపు వెడుతున్నారు. ఎందరెందరో వింత దుస్తుల్లో, దొరలు, పార్శీవారు, ఇరాన్ దేశస్థులు, సింహళులు, తమిళులు, కేరళవారు గుజరాతీలు, కాబూలీలు, ముస్లిమ్‌లు, నేపాళీయులు, బౌద్ధులు-- తామొక్కరే ఆంధ్రులు. గుజ్జం పిల్లలపై పిన్నలు. ఇదరేసి నడిపిస్తూ వృద్ధులు. ఆమె— ఎంతలావో— మదర్ సుపీరియర్— నవ్వుతూ నడుపుతోంది గుఱ్ఱాన్ని, అంత లావుంటే అది నడవగదా అని తనే ఆశ్చర్యపడ్డట్లు. మంచు, నేలమీద తుట్టలల్లే పడింది, చెట్లమొదళ్ళలో, పొదలపైనా, రాళ్ళపైనా— మంచు—కోసిన కలప ముక్కలల్లే ప్రారంభమై పైకి పోనుపోను ఎక్కువవుతూ వొచ్చింది. చలి మొదలెట్టింది, ఖిలిన్‌మార్గ్ శిఖరంపై చేరుకునేసరికి అంతటామంచే. అక్కడ రెండుమూడు టెంట్స్ ఉన్నాయి. సిక్కులు టీపెట్టి అమ్ముతారు. కేక్స్, టీ.

దూరంగా అన్నివేపులా మంచుకొండలే— హిమవత్ శిఖరాలు. వొకొక్కటి వొక మంచి ముత్యం. అన్నీ ఒక ముత్యాలహారం. మేఘం విడినప్పుడు కాంతిపడి, మెడతిప్పి, హారం అందం చూడమన్నట్లు అవి మెరుస్తాయి. ఏ మనిషీ అడుగుపెట్టని స్థలం— "ఈ ముత్యం యెంత బాగుందో!" అని వేళ్ళతో కదపనిహారం. మేఘాలు కమ్మివేశాయి— హారంచూసి దిష్టికొడతావేమో, మాయమనుషులన్నట్లు. మేఘాలు, తెల్లశాలువలు, కాముక్రీడతో మైమరిచిన శిఖరాలు, చలికి కప్పుకోవాలని తెలియదు గావున, మేమే కప్పుతాం—అని మేఘాలు వాటిని మూసివేస్తాయి. ఆ శిఖరాల అందం చూడకండి. ఎండకి కరిగి, ఆ ప్రకృతి స్థనాలమీద

మంచు జారుతుండా పొలుకారినట్లు! మనకి కనబడదు.

"అదేనండి—అటు చూడండి—అదేట నంగా పర్వతం—మహా శిఖరం...." అంది మాధవి. నీలం వెల్వెట్ జాకెట్‌పై, ఫర్‌కోట్ మోకాళ్ళమీదికి పడేది—వేసుగుంది. నల్లద్దాలజోడు పెట్టుకుంది. అడుగున రబ్బర్, పైన ఫర్ ఉన్న కాలిజోడు. జడ ముడిచేసి, పైకిచుట్టి, దానిపై ఫర్‌టోపి ధరించి పరదేశ స్త్రీలావుంది మాధవి నంగా పర్వత శిఖరం—దూరంగా పారావేస్తోంది. దాని నడుం నీలం—మొఖం ఎరుపు చుట్టూ పసుపు. మూడురంగుల ప్రకృతి చిత్రం. విర్రవీగి శిఖరంతో ఆకాశాన్ని కొయ్యడం లేదు. నమ్రతతో, భక్తితో చేతులు జోడించిన శిఖరం.

"మీరు చలితో వొణికిపోతున్నారు. ఈ కోటు వేసుగోండి" అంది మాధవి. అవును. అది మేనెల. అంత చలిగా వుండదన్నారు. చలిని వారించేదుస్తులు తను తెచ్చుకోలేదు. కాని యిక్కడ చలిగా వుంది. పదివేల అడుగుల ఎత్తు, ఆమె కోటువిప్పి, అతని భుజాలపై కప్పింది. బొత్తాములు పట్టవు. ప్రీతమ్ తన షాల్ ని తెచ్చి, అతని నెత్తికి చుట్టింది. "తన బొమ్మ గియ్యమంటోంది. ప్రీతమ్" అన్నాడు హరికృష్ణ. టెంట్‌లోకెళ్ళి-అక్కడివారితో ఏదో మాట్లాడి, టెంట్ వెనక నీడలో బల్లలు, కుర్చీలు వేయించాడు హరికృష్ణ. దాని మీద కూర్చుంది ప్రీతమ్. మరోబల్లమీద కూర్చుని ఆమె బొమ్మ గీశాడు రవిప్రకాశం. మొహం పోలిక లేదుగాని, మనిషి కూర్చున్న ఆకృతి వొచ్చింది. వెనకాల, దూరంగా కొండలు. గబగబ ముగించాడు.

"మరినాదో?" అంది మాధవి.

"చలికి వేళ్ళు పనిచెయ్యడంలేదు" అన్నాడు. అందరూ కర్రపీట బండ్లమీద మంచులో జారుతూ, కొండపైకి వెళ్ళారు. ఆ బండి అరడుగు ఎత్తు—రెండు చక్రాలుంటాయి. వాళ్ళు లాగుతుంటె, మంచు పొడుమై, నీరై ఇరువైపులా పాయలై మీద పడుతూవుంటుంది. పైకి వెళ్ళారు. అక్కడ చిన్నకొలను. బంగారం రంగు. సూర్యబింబం సిగ్గుతో తల వంచుగునే మెరుపు. మేఘాలు దూరంగావెళ్ళి చోద్యంచూస్తూ, వాటివంకర అందాన్ని ఆ నీళ్ళలో చూసుగుంటాయి! రవిప్రకాశం చలిలో వొణికిపోతు

న్నాడు. మొహం నల్లబడుతూంది. వేళ్ళు కదలడంలేదు. శ్వాస సుళువుగా రావడంలేదు. కోటు తీసివేసిన మాధవి కూడా వొణికిపోతోంది. పసుపు, ఆకుపచ్చ, చాకలెట్ రంగు. కాస్తంత నలుపు—వెండికి తుప్పుపట్టినట్లు—ఆమె మొహం వైఖరి మారిపోతోంది. బొత్తాములున్న చోట ఫర్‌కోటు ఎడంచేసి, తన మొహం అందులో దాసుకుని, రవి నడుంపై వాలింది మాధవి. మెడమీదికి చేతులుపోనిచ్చి మొహాన్ని తనమీదికిలాక్కుంది. ఆమె అధరాలు చలికి బీటలువారి, గట్టిపడి, గరుకుగా అయ్యాయి. ఆయాసంతో వెనక్కి వాలిపోయ్యాడు. అతన్ని బండిమీదకి ఎక్కించి, ఇద్దరు పట్టుగుని టెంట్‌లోకి తీసికెళ్ళారు. నిప్పుముందు కూర్చోబెట్టి, చేతులు, కాళ్ళు, వేడికోసం రుద్దుతున్నారు.

టీ త్రాగాడు. క్రిందికి దిగుదామన్నారు. గుర్రాలు సిద్దంచేశారు. అక్కడ కాకులు, టెంట్‌చుట్టూ తిరుగుతున్నాయి. మంచుకొండ గోడ మీదుగా కాకులు, చిత్రం!.... ఖిలిన్‌మార్గ్‌లో కాకి. తెల్లటి బట్టమీద నల్ల కాకి వేసినట్లుగా—ఆ తిండికోసం ఇంత దూరమొచ్చాయి—కాకులు.

ఖిలిన్‌మార్గ్ అంటె గొర్రెల ప్రాంతం. అక్కడ ఏ ఇతర ప్రాణి లేదు. కాకి వొక్కటే. అది కాకి మార్గం. ఎంత దూరంనుండో, యెంత ఎత్తుకో—ఆ చలికితగ్గ ఈకలు, అవయవాలు లేకపోయినా మనుషుల్ని వెన్నాడుతూ వచ్చింది కాకి. ప్రాణికోటిలో అదొక్కటే మనిషికి మిత్రుడు. తోడుండే ప్రాణి. దిగుతున్నారు గుర్రాలమీద. దిగడం కష్టం. ముందుకి వొరిగిపోతారు. వెనక్కిడెక్కించి కూర్చోవాలి. వెన్ను, కాళ్ళు, పిరుదులు హూనమైపోతాయి. రెండు గంటలలో దిగి, కారు మీద బసకి చేరుకున్నారు. మళ్ళావొస్తానని రవి తన పడవకి వెళ్ళిపోయారు.

మొర్నాడు రవి లేవలేకపోయ్యాడు. హీరాలాల్ డాక్టర్ని పిలిపించి చికిత్స చేయించాడు. వొళ్ళుపట్టే కుర్రాడిని ఏర్పాటుచేశాడు. ఆమొర్నాడు ఏకాంతంగా వుండేచోటులో గడపాలన్నాడు రవి. మానసబల్ సరస్సు ప్రశాంతంగా, మారుమూలగా ఉంటుందన్నాడు కాదిర్. అక్కడికి వెడదామన్నాడు.

మానసబల్ సరస్సు శ్రీనగర్‌కి పదునెనిమిది మైళ్ళ దూరం. హీరా

లాల్ ఒక జీపు, కుర్రవాడిని వప్పగించాడు. మధ్యాహ్నం వొంటిగంటకి బైలుదేరడానికి నిశ్చయమైంది. పెందరాళే భోజనంచేసి, పరున్నాడు రవి ప్రకాశం. పన్నెండు దాటింది. ఎవరో గదిలో కొచ్చిన అలికిడయింది. మంచం ప్రక్కనే నిలబడింది మాధవి. పడవగది కిటికీలన్నీ మూసి వున్నాయి. ఒకదానిమీద కర్టెక్ లాగివుంది. చీకటిగా, చల్లగావుంది.

"నువ్వా........" అని లేవబొయ్యాడు.

"లేవకండి. ఎలా ఉన్నారో చూద్దామనొచ్చా. చూడకుండా ఉండ లేకపొయ్యానబ్బా........" అతను ఎక్కడికి వెళ్ళదల్చుకున్నదీ చెప్పాడు.

"నేనూ రావొచ్చా—రానీండి. మీరొక్కరూ—అమ్మో. యెలా ఉండగల్రు. నేనేమనుకున్నారో!........కోపమా?" అంది.

"ఎందుకు?"

"లేకపోతే ఫరవాలేదు." పిక్నిక్ పరికరాలు, సంచీలో సిద్ధంచేసింది మాధవి. పడవవాడు, టీ, బిస్కట్లు తెచ్చాడు. ప్లాస్టర్ ముద్ద, చిత్రలేఖనం పరికరాలు, ఒక పెట్టెలోవుంచి, అన్నీ జీప్‌లోకి లోడ్‌చేశారు. ఒంటిగంట న్నరకు కదిలింది జీప్. ఓపిగలేక, ఆ రోజు రవిప్రకాశం గడ్డంచేసుకో లేదు. అక్కడక్కడ తెల్లవెంట్రుకలున్నాయి. తైలంలేక, జుట్టంతా, రేగి చిందరవందరగా వుంది. పైజామా, లాల్చీ, దానిమీద కాశ్మీరం వేస్టుకోటూ ఒక ఫర్‌టోపీ వేసుగున్నాడు. చేతిలో కర్ర. జీప్, మధ్యలో నిల్చింది. కుర్రవాడు టాంగా మాట్లాడాడు. జీప్ అక్కడ నిల్చిపోతుందిట. టాంగాలో కచ్చా బాటలో రెండు మైళ్ళు వెళ్ళారు. ముగ్గురూ టాంగాలో, రెండు మైళ్ళు వెళ్ళాక, టాంగా నిలిచిపోయింది. అక్కడే వుండిపోతుందిట. అక్కడనుండి మరో మైలు నడిచి వెళ్ళాల్సిందే. సామాను, కుర్రవాడు మోస్తున్నాడు. రవిప్రకాశం మాధవి నడుస్తూ వెడుతున్నారు. అన్నీ ఆకు పచ్చ కొండలు—అంత ఎత్తైనవికావు. గొర్రెలమందలు—కాపరులు తెల్లటోపీలు, తెల్లగుడ్డలు, పొడుగాటి లాల్చిలు—చేతిలో కర్రలు— దూరంగా మంచుకొండల శిఖరాలు.

సెలయేళ్ళు పచ్చకొండల నడుమనుంచి జారి, ఎర్రరాళ్ళ నేలమీదుగా, అడుగులోతున, ప్రవహిస్తున్నాయి. ఒకటి రెండు మానసబల్ సరస్సులో

కలుస్తున్నాయి. వాటిలోంచి నడుస్తున్నారు. పాదాలకింద, నీళ్ళలో పట్టు లాంటి ఇసుక, చిన్న రంగురంగుల రాళ్ళు—సన్నగా గానంచేస్తూ కదులోంది నీరు. కొండలకింద చీనార్ చెట్లు. కొన్ని కొండచెట్లు— తెల్లటి మానులు—వెండి తొడుగులా, సన్నగా, పొడుగ్గా మెరుస్తున్నాయి. దూరంగా ఆ చెట్లనడుమ కస్తూరి మృగం, కనబడి, వింతగాచూసి పరుగెత్తింది దిగువున తప్పు పండ్లు, సెలయేటి గట్లమీద వంగ, జల్దరుపండ్లు-కొమ్మల మీద మామిడి పిట్ట. మరో ఫర్లాంగు నడిచాక, "హట్"కి చేరుకున్నారు. కుల్లివాడూ, సామాను, అక్కడవుండిపొయ్యాడు. ఒక సంచి మాత్రం తీసుకుని వారిద్దరూ సరస్సుకేసి నడుస్తున్నారు. విర్జన ప్రదేశమది. అంతటి ఏకాంతం మరెక్కడా కనబడదు. చిన్నచిన్న పొదలు గట్లవెనక, రంగు రంగుల పూలమొక్కలు గుబురుచెట్లు, వెండ్రి మానులు. ఆ అందానికి తట్టుకోలేక, పిట్టలుకూడా రెక్కలు ముడుచుకుని విద్రిస్తున్నాయి.

ఆ్తా చల్లటి నీడ— ఏకాంతం విప్పిపారేసిన వస్త్రం—తడిపి ఎండబెట్టినట్లు, చుట్టూ మానులు, ఆకులు, సర్వాంతర్యామిగా గడ్డి—పచ్చ తివాసిలా పరిచివుంది. కాగితం తీశాడు. రంగులు కలుపుతున్నాడు రవి. పచ్చకొండ, పచ్చచీర ధరించినట్టుంది. దానిమధ్యగా కొన్నిచోట్ల చీరమడతల్లా అమరిఉన్నాయి. అతను వెయ్యదల్చుకున్న చిత్రం చీరమడతలు. ఆధునిక శైలిలో— గీతలు, కోణాలు, చదరాలు— వొంపులుండవు. దూరంగా కూర్చున్న మాధవి స్కెచ్ గీశాడు. మాధవి చేతులపై తల ఆనించి చూస్తోంది.

"కాసేపు రెస్టు తీసుకోరా ఏం?" అని దగ్గరగావొచ్చి అతని వొళ్ళో తల ఆనించింది.

"వేడిగా వుంది. స్నానం చేద్దామా?" గబగబ హట్ దగ్గరికి పరుగెత్తి, సంచీలో బట్టలు, ఫ్లాస్క్ తెచ్చింది. నాలుగవుతోంది. పైజామా, పొట్టికోటుతో, జడ మెలితిప్పి, మెడకిందబిగించి, నీళ్ళలోకి దిగింది మాధవి. గట్టున కూర్చున్న అతని చెయ్యి పుచ్చుకుని నీళ్ళలోకి

లాగింది. గట్టున నడుంలోతు. అతని మొహాన నీళ్ళు జల్లుతూ, నడుం పట్టుగుని ముంచింది. వెన్నుమీద వాలి, అతని మెడచుట్టూ చేతులు బిగించి, శరీరం రాస్తోంది. ఉక్కిరి బిక్కిరై విదల్చుకుని దూరంగా వెళ్ళాడు.

"ఎందుకట్లా చేస్తావు?"

జుట్టురేగి ఆమె నుదుటిమీద పడుతోంది. జాకెట్టు మెడ దగ్గర స్తనాల నడుమ గీతమీద నీడ వెలుగుపడి కదుల్తోంది.

"మీ కిష్టంగా...." అంది.

"నీతో అన్నానా?"

"ఆమాత్రం తెలీదా ఏమిటి? మీ కళ్ళే చెప్తాయి" అని దగ్గరగా వచ్చి, అతన్ని మీదకి లాక్కుని, నోట్లో నీళ్ళు పోస్తోంది.

"సర్దా లేదా?"

"నీకంటె ఎంతో పెద్దవాడిని. నువ్వు పెండ్లి కావల్సిన దానవు" అన్నాడు.

ఆమె చెక్కిలి అతని గడ్డానికి రాస్తూంది.

"షేవ్ చేసుకోరాదూ...."

"నా ప్రశ్న వినబడలేదా?" అన్నాడతను.

"దానికీ దీనికీ ఏం సంబంధం? నాకా తేడాలు లేవు" అంది మాధవి.

ఆధునిక స్త్రీ—కొత్తరకంది. మారిన దృక్పథంగల నేటి కాలపు స్త్రీలకు ఈమె ప్రతినిధి కాబోలు ననుకున్నాడు.

"నీకు లేకపోవచ్చు—ఇతరులకి వుండొచ్చుగా."

"ఓయబ్బ, నాకు చెప్పకండి. మొగాడికి అసలే లేవు. నే నెర గనా...."

"బాగా అనుభవం ఉన్నదానివల్లె చెప్తున్నావే?"

"నేనూ చూస్తున్నాగా."

గట్టుకి చేరారు. ఆమె దూరంగా వెళ్ళి, చీర ధరించింది. తెల్ల పట్టు—కాశ్మీరుది—అంచులేదు. నల్ల జాకెట్ వేసుగుంది. జడ సర్దుకుని,

దగ్గరగా వొచ్చి రాతి బండమీద కూర్చుంది. రవిప్రకాశం ఆమె దగ్గర కెళ్ళి, చీర మడతలు, సరిగ్గా తిన్నగా, గీతల్లా జారేటట్లు సర్దాడు. కొంత భాగం చీర పక్కకి తొలిగించి, అందులోంచి తొడ, మోకాలు, మడమ కనబడేటట్లు అమర్చి కదలకుండా కూర్చోమన్నాడు. రెండు గజాల దూరంలో, గడ్డి చదునుచేసి, పెట్టెమీద ప్లాస్టర్ ముద్ద అమర్చాడు. సంచి లోంచి రెండు తీగలు తీసి, వాటిని ఒక ఆకారంలోకి వొంచి, ఆ రెంటి చుట్టూ ప్లాస్టర్‌ని మెత్తి, అడుగెత్తున ఒక ఆకృతిని తయారు చేశాడు.

"నా బొమ్మ మొన్న గియ్యనన్నారుగా—"

"మాట్లాడకు. కదలకు."

తొడ పక్కకి కదల్చింది.

"సీతాకోకచిలుక—మరి చూడండి ఎలా!" అంది అమాయకంగా, ఆమెచుట్టు తిరుగుతున్న సీతాకోకచిలుకని తోసేశాడు. మళ్ళా కాలు అమురుస్తుండగా, ఆమె అతన్ని గట్టిగా కౌగిలించుకుంది. అతని తల తిరిగింది. బండమీద నుండి కిందకి జారిపోయింది. పట్టు విడవక, అతన్ని కిందికిలాగి, దొర్లించి, నలిపి, వక్షంపై వాలింది, ఆమె స్తనాలు తగుల్తున్నాయి. చేతులు పీకుతున్నాయి. ఆమె నోరు, కళ్ళు, కనురెప్పలు, చెక్కిళ్ళు, చెవి, జారి ఊడిన తల వెంట్రుకలు, ఎర్రటి శక్తి, ఏదో ఆవహించి, అతన్ని ఆమెవేపు లాగేస్తోంది. అస్వస్థతలోంచి కడసారి బలం ప్రజ్వరిల్లి కాలుస్తోంది నాళాలన్నీ లయతో కొట్టుకుంటున్నాయి. వ్యక్తిలో సంఘం అమర్చిన పొరలన్నీ ఊడిపోతున్నాయి. తార్కిక దశ దాటేశాడు-తర్కం, బుద్ధి, నైతికజిజ్ఞాస ఆ సరస్సులో మునిగాయి. ఆధ్యాత్మిక వెలుగుముద్దగా గడ్డకట్టి ద్రవించని శరీరంలో 'అహం లేదు—వ్యక్తి లేడు, ఫలానా మనిషి లేడు. సృష్టి ప్రేరేపించిన తృష్ణ గోళంగా మారి శూన్యంలో తిరుగాడుతున్నాడు. రంగులు లేవు. అంతా చీకటె. శూన్యం. తృష్ణగోళాలు—ఎక్కడో ఢీకొని ప్రేలి, బ్రదలై, మబ్బై, గాలై,—అంతమొందే ఆవేదన—భరించడం ఎరుగున్న ఆ గడ్డి, ఆ చెట్టు, ఆ సరస్సు, కన్నుగీటినా పలకని ఆకాశం-అది సృష్టిలో ప్రాణికదలిక—

అంతమయ్యేటప్పుడు మిగిలే ఏకాంతం, ప్రశాంతం. ఇద్దరిలో ఇంద్రియాలూ గతులుతప్పి దేన్నో వెదుకుతూ, వెదికినదాన్ని పొందగానే విస్పృహ చెందినట్లు, అలిసి వెనక్కు జారుకుని, యధాస్థానాలకి చేరుకున్నట్లు— ఒక్క దీర్ఘమైన శ్వాస. అందమైన అలసట కమ్మటి చెమ్మట-తృప్తి ప్రకృతిని కప్పుగుని పవ్వళిస్తోంది....అన్నీ సర్దుకుని దూరంగా కూర్చుంది మాధవి.

"ఇప్పుడన్నా సరిగ్గా కూర్చో" అని చీరమడతలు, మోకాలు అమర్చి దూరంగా వుండి ఆ శిల్పం ముగించాడు. ఎందరో సృష్టికర్తల శరీరాలలో దాగిన శక్తులకు లొంగిన శిల్పం అది. దాని వెనక చరిత్రలో భగ్న హృదయులైన స్త్రీ, యుద్ధంలో ఓడిచచ్చిన చక్రవర్తులు ఓడలు నడిపిన బానిసలు, భూకంపానికి తట్టుగుని నేలలో పడని పీరులు, ఎన్నెన్నో హృదయాలు పగిలినప్పుడు పటాపంచలైన అణువులు—వాటినుండి కాల వాహినిలో ప్రవహించి అతని చేతుల్లో ఆ ప్లాస్టర్ ముద్దపైకి ఉప్పొంగి కల్పించిన ఆకృతి-సిద్ధంగా వుంది. అవతల తలుపు తీస్తే ప్రవాహం వచ్చిపడుతుంది. ఆ తలుపు తీసింది మాధవి.

ఆరు దాటింది. ఫ్లాస్కులో టీ త్రాగాడు-గడ్డిలో వాలి కళ్ళు మూశాడు. సంధ్య విప్పిపారేసిన ఎఱ్ఱబట్ట సరస్సులో తలుపుతున్నా రెవరో. తెల్ల మ్రానులు నల్లబడుతున్నాయి. నలుపు శాలువ కప్పుతున్నారు.

"మరి వెడదాం పదండి."

అని సామాను సంచిలో సర్ది, అతన్ని లేవనెత్తింది మాధవి. ఒక మహాసత్యాన్ని, గొప్ప సౌందర్యాన్ని సందర్శించిన యోగికి మల్లె తన్మయుడై లేవలేకపోతున్నాడు రవి.

ఎక్కడికి వెళ్ళటం? ఎక్కడనుండి వొచ్చాము? తానెవరు? ఆమెవరు? తెలుసు, అంతా మాయ. ఆనందంతో విశ్రమించే శరీరానికి అన్నీ సమాధానాలే. టాంగాలో, జీప్‌కు చేరేసరికి ఎనిమిదైంది

o o o

ఆమొర్నాడు ప్రయాణమై ఇంటికొచ్చేశాడు రవి ప్రకాశం. మరో వారం అయ్యాక వొస్తానంది మాధవి ఉన్న సరుకుతో ఇంటికొచ్చెయ్యి,

అక్కడేదన్నా వ్యాపారం పెట్టుకోవచ్చుననీ, హరికృష్ణకి సలహాయిచ్చి, తివాసీలు, శాలువలు, పట్టుకురమ్మని, స్నేహితుడిదగ్గర సెలవు తీసుకుని బైలుదేరాడు రవి. "చీర మడతలు"-శిల్పం కళాఖండాల పోటీ ప్రదర్శనకై పాక్ చేయించి, తన స్నేహితుడి పేరిటపంపి, అతన్ని ప్రదర్శనకర్తలకు అందచెయ్యమన్నాడు. రెండోది—"చీర మడతలు" అన్నది వాటర్ కలర్ చిత్రం. మెడకిందభాగం మాత్రం కనబడే చిత్రం—ఆధునిక శైలిలో గీసినది.-దాన్ని మరో ప్రదర్శనకి పంపించాడు.

ఇంటికెళ్ళి మరో వారం గడిపి భార్యతో కలిసి స్వగ్రామాని కొచ్చాడు.

కంపెనీ వ్యవహారాలలో పెద్ద మార్పు లేవీ లేవు. తను సప్లయ్ చేసిన కప్పులు, సాసర్లు, చాలవరకు పగిలాయట తాను తెప్పిస్తున్న స్టెయిన్‌లెస్ స్టీల్ కొంత కప్పులు, సాసర్లకీ వాడి, వాటిని పనివాళ్ళ కందచెయ్యడానికి సంకల్పించాడు. హరికృష్ణ తెచ్చే తివాసీలని గదులలో వేయించాలి.

పది రోజుల్లో మాధవి పనిలో చేరింది. రవి, హరికృష్ణకి కొంత పెట్టుబడి పెట్టి, రెండు గదులు అద్దెకి తీసుకుని తివాసీలు, శాలువలు వ్యాపారం నడుపుగునే ఏర్పాటు చేయించాడు. కంపెనీ డబ్బుతో, డజను తివాసీలకి ఆర్డర్ ఇప్పించాడు కాని, మానేజ్‌మెంట్ దానికి సమ్మతించలేదు. టెండర్లు కొటేషన్లు కావాలన్నారు పెద్దలు. అసలు తివాసీలు వొద్దే వద్దన్నారు. బురదకాళ్ళతో తొక్కే యీ అలగా జనానికి తివాసీ లేమిటి. తను స్వంత పనివాళ్ళు అలగాజనమా? ఇంతేనా వీరి అభిమానం, ఆదరణ!

"ఏదయ్యా, స్టెయిన్‌లెస్ స్టీల్-- ఐదారువేలు తీసి కెళ్ళి బొంబాయి, కాశ్మీరం తిరిగొచ్చావు. ఇంతవరకూ సరకు కనబడదేం?" అని ప్రశ్నించాడు నరసయ్య. అవును స్టీల్‌షీటు ఏనాడో వొచ్చి ఉండాలి బొంబాయినుంచి. గంగాధరం కొన్న స్టీల్‌షీట్స్ ఎప్పుడో ఒచ్చాయట. వాటితో అవసరమైన మరమేకులుకూడా తయారుచేయించారట.

"చూడు ఈ మర మేకు— ఎంత పసందుగావుందో, నీ సరుకేది?" అన్నాడు నరసయ్య. రెండు స్టీల్ మరమేకుల్ని బల్లమీద తిప్పుతూ. తెల్లగా. సన్నగా, మెరుస్తున్నాయి మేకులు. దిగువున అంగుళన్నర మర తిరుగుడు--- తీగ. చాలా ఉపయోగంట. నాణ్యమైందిట. ఆ తిరుగుడులో లయ, క్రమం చూస్తున్నాడు రవి వాటిని తన అరచేతిలోవుంచి. ఒకడజను మరమేకుల్ని, కాన్వాస్‌లోగుచ్చి, వాటిని ఆధారంగా ఒక డిజైన్ తైలవర్ణంలో తయారుచేస్తే? ఆధునిక నైరూప్య చిత్రం అవుతుంది. పారిస్‌లో కళావిమర్శకులు మెచ్చుకుంటారు. రాక్ ఫెలర్, పీర్ పాయింట్ మార్గన్ కుటుంబాలవారు కొన్నివేల డాలర్లకి కొంటారు ఆ చిత్రాలని.

ఇక్కడ మరమేకు, షీట్లకు దిగేస్తారు. ఎక్కడికో పంపుతారు, వారు వీటిని మరోదానికి ఉపయోగిస్తారు. పైదేశాలకి పంపుతారు. లక్షల మీద వ్యాపారం చీర ముఖ్యంగావి, చీరమడత ఎవరిక్కావాలి? మరమేకు, చీరమడత?

గంగాధరంకి టెలిఫోన్ చేశాడు— తనకంపెనీ స్టెయిన్ లెస్‌స్టీల్ షీట్ల విషయం.

"ఏమో నాకేం తెలుసు?"— అని గంగాధరం ఫోన్‌లో జవాబు.

"లైసెన్స్ తీసుకుని పంపమన్నానుగా."

"తీసుకోమన్నావు— కాని ఇవ్వందే" అన్నాడు.

"అదేమిటి, కోటులోపల జేబులోవుంది తీసుకోమన్నా—తీసుకున్నావు లైసెన్స్, చెక్కు........"

"అన్నావు. తీసుకోందే. ఇస్తావనుకున్నా. సోమయ్యని స్టేషన్‌కి కూడా పంపాగా?" అన్నాడు గంగాధరం.

"విజం? నువ్వు తియ్యడం చూశాను చూసినట్లు జ్ఞాపకం........"

"అంతేలే— నీ వన్నీ జ్ఞాపకాలు, స్వప్నాలు. నీ వొంటో బాగాలేదు. మైకంలో పడుకుని వున్నావు. ఇలా భ్రమించివుంటావు. అంతే." అన్నాడు గంగాధరం.

"అంతే?"

"అంతంతె."

ఫోన్ దించేశాడు. చెక్కు, లైసెన్స్, గంగాధరం తనజేబు పోకెట్‌లోంచి తియ్యటం తనుచూశాడు. సందేహం లేదు. ఏదీ చెక్కేదీ--తియ్యకపోతే తనదగ్గరే వుండాలిగా ఇంటికెళ్ళి తను కాశ్మీర్ తీసుకెళ్ళిన దుస్తులు గాలించాడు. అవి చాకలి తెచ్చినవి. ఏనాడో రాళ్ళకిపూడి, నీళ్ళలో కలిసి పోయివుంటాయి. గంగాధరం అంత అబద్ధం ఆడతాడా? తనే పొరబడివుండాలి. మొత్తంమీద లైసెన్స్, డబ్బు పోయ్యాయి అరటన్ను స్టీల్ షీట్స్-- ఐదువేలు, అమ్మితే లాభం రెండువేలు -- మొత్తం ఏడు వేలు. తన ఖర్చులువేయి. గంగాధరం అంతటి దారుణానికి వొడికడతాడా? ఇదివరలో కూడా తను, అతన్ని అనవసరంగా సందేహించాడు-- టెలి ఫోన్ చేసినసందర్భంలో. రూపాయిది రెండురూపాయలకి కొన్నాడని సంశయించాడు. ఇదంతా గంద్రగోళంగావుంది. తన వొళ్ళు, మనస్సు బాగున్నాయా? డాక్టర్ని మళ్ళా చెకప్ చెయ్యమన్నాడు. ఏ దోషమూ లేదన్నాడు. ఫిట్‌గా వున్నావన్నాడు డాక్టర్.

కంపెనీ పెద్దలు భూషణంద్వారా కబురంపారు వారం రోజుల్లో సరకు రాకపోతే చర్యతీసుకుంటామని. బొంబాయిలో ఒక రిద్దరి స్నేహితులకి వ్రాశాడు రవి. లైసెన్స్ విషయం దాని నంబరు, వివరాలూ వ్రాసుకోనందుకు తనపై తాను అగ్రహించాడు. ఆరోజున బొంబాయిలో అతని వంట్లో బాగాలేదు-- గంగాధరాన్ని పూర్తిగానమ్మాడు. లైసెన్స్ అతను తీసుకున్నాడు మళ్ళా అదే గొడవా? తనపొరబాటే. తన అజాగ్రత్తకి తగిన శాస్తి జరిగింది.

రోజు శనివారం! సాయంత్రం కంపెనీ ఆవరణలో భజనలు పెట్టాడుట గంగాధరం. పనివాళ్ళు వాళ్ళ కుటుంబాలు అక్కడికి పోతున్నారు. భజన కీర్తనలు పాడుకుంటున్నారు. పనివాళ్ళు అణిగి మణిగి ఉండేటందుకు ఇదొకటి పెట్టాడు గంగాధరం. ఇంతలో కలకత్తాలో మరో బ్రాంచ్ పెట్టడం; ప్రమోషను పెద్దజీతంయిచ్చి గంగాధరాన్ని దానికి డైరెక్టర్‌గా వెయ్యడం జరిగాయి. ఆ రోజు గంగాధరాన్ని అభినందిస్తూ, సభ ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆరింటికి సభ. ఐదున్నరకి తన పని

ముగించుకున్నాడు, రవిప్రకాశం. ఇంక ఒక్కరోజు గడువుంది సరుకు సిద్ధం కాకపోతే, కంపెనీవారు చర్యతీసుకుంటారు. ఏం చర్య? సస్పెండ్ చేస్తారా? దర్యాప్తు జరుపుతారా? కోర్టు కెడతారా? ఏం చెయ్యడం?

"ఇంకా ఇక్కడే ఉన్నారా? పార్టీకి వెళ్ళడం లేదా?" అంది మాధవి.

"అవును. వెళ్ళాలి" ఆవులింత విలుపుగున్నాడు రవి ప్రకాశం.

"ఏం దిగులుగా ఉన్నారేం........ మీకొక రహస్యం చెప్పనా?"

"ఏమిటది?"

"మనసులో వుంచుగోవాలి. తెలిస్తే కొంపలుమునుగుతాయి."

"నాతో చెప్పదగ్గదైతే చెప్పు" అన్నాడు.

"మీకు సంబంధించినదే........" తలుపు దగ్గరగా వేసి, రవి దగ్గరకొచ్చి, రహస్యంగా చెప్పింది.

"నా కెట్లా తెల్సిందని అడక్కండి.........మీ లైసెన్స్ గంగాధరం అమ్మివేశాట్ట!"

"ఆ ఆ!" ఆశ్చర్యంతో లేచి నిలబడ్డాడు. ఇంతలో రంజిత్ వొచ్చాడు. నమస్కారం పెట్టాడు. మాధవి, రా వెడదాం అన్నాడు.

"మరి వెడతాం" అని, ఇద్దరూ బైట కెళ్ళారు.

రవిప్రకాశం క్షణంలో నిర్ణయించుకున్నాడు. గంగాధరం చేసినపని అపచారం. ఆ పనికి జైలుకి పంపాలి అతన్ని! ఈ విషయం, వారి మేనేజ్‌మెంట్ వారికి తెలిపితే వారే చర్య తీసుకుంటారు. తన నిజాయితీ ఋజువవుతుంది. ముందు నరసయ్యకి చెప్పాలి. గంగాధరం క్రిమినల్.

కాని దానికి ఆధారం ఏముంది? కాగితాలా? సాక్షులా? ఏమీలేదు. మాధవిమాట. అది చెప్పడానికి వీల్లేదు. మాధవికి నానుండి విశ్రాంతి కావాలన్నాడు గంగాధరం. మాధవీలత ఒకటల్లుకొందీ అని ఎవరోపాడుతూ అతన్ని ఎగతాళి చేసిన సంగతి గుర్తుకొచ్చింది. కమిటీ సభ్యులకి, ఒకటి రెండు ఆకాశరామన్న ఉత్తరాలు పంపించారు— "మామిడి కొమ్మ ఎవరు?" అని ఆ ఉత్తరంలో ప్రశ్న. మాధవిమాట నమ్మాలా? కాని మాధవి ఈసారి నిజంచెప్పిందని నమ్ముతున్నాడు రవి. అందుకు కారణం

లేదు. ఆ సందర్భంలో ఆమెని నమ్మితీరాలి. ఆమె ధోరణిలో, కంఠంలో ఏదో సత్యం పలికినట్లయింది. ఆమెకెట్లా తెలిసింది? సోమయ్య రహస్యంగా రంజిత్‌తో అనుండాలి. రంజిత్ మాధవితో చెప్పుఉండాలి.

దీనికొకటే మార్గం. డ్రాయర్‌లోంచి తాను శ్రీనగర్‌లో కొన్న వరలో బాకు తీశాడు. వాల్‌నట్ కర్ర--- నగిషీ పని--- స్టెయిన్ లెస్‌స్టీల్ డిజైన్‌తో పొదిగిన వర --- ఆరంగుళాలది --- అందంగా వొంపు తిరిగింది. అందులో బాకు. క్లిప్‌తీసి కత్తిని పైకిలాగాడు అది తళతళ మెరుస్తోంది రెండంగుళాలు సులువుగా దిగుతుంది. మంచి వొంపు మొన. అందమైన కళాఖండం--- హత్యాకాండకి. చాకుని లోపలపెట్టి, క్లిప్పు నొక్కి ప్యాంట్‌జేబులో వేసుగుని, కార్లో గంగాధరం కంపెనీ కెళ్ళాడు రవి.

ఏడైంది. అన్నీ దీపాలు. జనం కిటకిటలాడుతున్నారు. కుర్చీలు నిండిపొయ్యాయి. కొందరు బెంచీలమీద ఎక్కి నిలబడ్డారు. ముందు చాపలమీద పిల్లలు, స్త్రీలు. టీ కప్పులు అందిస్తున్నారు. లౌడ్‌స్పీకర్ ఏర్పాటు చేశారు. వేదికపై షామియానా -- పూల దండలు. కమిటీ మెంబర్లు--- ఊళ్ళో పెద్దలు, కలెక్టర్, గంగాధరం, భార్య అనసూయ. అతను ఖద్దరుకోటు ధరించాడు. ఖద్దరుపంచి, అనసూయ ఖాదీసిల్కు చీర వేసుగుంది. ఉపన్యాసాలు సాగుతున్నాయి. అనసూయ మహాఇల్లాలు. గంగాధర మహానుభావుడు. ఏక పత్నీవ్రతుడు. వారు ఆదర్శదంపతులు. గనకనే కంపెనీ వర్ధిలుతోంది. కొత్తచోట వారికి మేలు కలగాలి--కలుగుతుంది శీలం మన జాతి ప్రభకి వెన్నెముక. యంత్రం కాదు. ఆత్మ. మరలుకావు మనస్సులు. సీత, అనసూయ, సావిత్రి, శ్రీరాముడు ....

చప్పట్లు. ఎవరో ఏదో బహుమతి అందించారు. వెండిలో చెక్కిన సీతారామ లక్ష్మణుల విగ్రహం--- పైన అద్దం. గిల్ట్ ఫ్రేమ్. గంగాధరం భక్తుడు. భజనలంటూ పెట్టి, దైవభక్తి, పాపభీతి, పరమార్థ చింతన పెంపొందిస్తున్నాడు. కొత్తచోట్లకూడా ఇల్లాంటి భజన మందిరం కట్టించాలని మా ఆశయం.

మళ్ళా చప్పట్లు. కాశ్మీర్ తివాసి బహుమతి—ఎవరో అందజేశారు. ఆ దంపతులు నడిచేటందుకు అనువైన తివాసి.

"కంపెనీ కోటాలోనిదే నటగా!" అన్నాడు ఎవరో ప్రక్కన. రవి ప్రకాశం నవ్వుకున్నాడు. ఏకపత్నీవ్రతుడా—బొంబాయి రాత్రి గుహల్లో కాగడావేసిన ఈ గంగాధరం! శీలం అంటే అదొక్కటేనా? రూపాయిది, రెండుకు కొని లాభం పొంది, తనని దగా చేసిన వీడు నిజాయితీగల వ్యక్తా? లైసెన్స్ దొంగిలించి, తన కంపెనీని మోసంచేసి, తన పతనానికి కారకుడైన వీడు మహానుభావుడా! వీడికి ప్రమోషన్ అభినందనలు, బహుమానాలు! వెనుకనుండి వెళ్ళి వేదికపైనకూర్చుని అంతాచప్పట్లుకొడుతున్నసమయంలో ఒక్కపోటు-ఆఖరు కథసమాప్తం ఈసమాజంలో న్యాయానికిమరో మార్గం లేదు.మాధవి బెంచీ పక్కన కూర్చుంది. మరో కుర్చీమీద రంజిత్.ముందు బెంచీలమీద ధనంజయం, అతని ప్రక్కన లక్ష్మీకాంతం. వేదికపై నరసయ్య సోమిరెడ్డి—ఒక్కపోటు! వేదికవైపు వెడుతున్నాడు రవిప్రకాశం. పాంట్ జేబులో చెయ్యిపెట్టుగుని కత్తిని అదిమిపడుతూ సభలో కలకలం. ఉపాన్యాసాలు ముగిసినట్లున్నాయి. పెద్దగా చప్పట్లు గంగాధరంలేచి సమాధానం చెపుతున్నాడు. కృతజ్ఞత తెలియబరుస్తున్నాడు. కంపెనీ సంక్షేమం, తద్వారా దేశసేవ, తప్ప వేరే పరమార్థం లేదన్నాడు. గీతలో ఏదో వాక్యం చదివాడు. ఇహం, పరం అన్నారు గావున, భజన కాలక్షేపం, ఏదో ఉడతా భక్తి........మళ్ళా చప్పట్లు అనసూయ కళ్ళుతడితో మెరుస్తున్నాయి. భజనగీతం పాడదాం అన్నాడు గంగాధరం, తనే అందుకున్నాడు. అందరూ కలిసి పాడడం మొదలెట్టారు. ఆ సమయంలో పొడిస్తే గంగాధరంకి స్వర్గం తప్పదు ఇక్కడే స్వర్గం అనుభవిస్తున్నాడు. చంపి మరో స్వర్గానికి—శాశ్వతంగా అనుభవించే స్వర్గానికి పంపనా; ఎంత అవివేకం! అనసూయమ్మ ఇల్లాలు— తన భార్యలా. వీణ్ని చంపి ఆమెకి వైధవ్యమా? ఐనా గంగాధరం ఎందుకు చావాలి? తనకున్న వాంఛలన్నీ అతనికీ ఉన్నాయి, గుహలో కాగడా అతనూ వేస్తాడు—ఎటొచ్చీ, రహస్యంగా

ఎవరికీ తెలియకుండా. అదే అతని చాకచక్యం. కార్యదక్షత. సమాజంలో పలుకుబడికి ప్రమోషన్‌కి అదే కారణం. దొరికిపోని దొర. గంగాధరం మనిషి—కాని ఉద్రేకం చూపడు. ఆ ఉద్రేకాన్ని మరమేకులో జొనుపుతాడు. అతనూ సృష్టిస్తాడు—మరమేకుల్ని. తాను చీరమడతల్ని సరిదిద్దితే, అతను మరమేకల్లో అంచుల్ని తీర్చిదిద్దుతాడు. మరమేకుకి స్థూల జగత్తులో ప్రయోజనముంది. చీరమడత చిత్రం నిష్ప్రయోజనం. మానవుడు గంగాధరం. తోటి మానవుడు. కలిసి చావడానికే తోటి మానవుడి ప్రయోజనం. ముందెందుకు చావాలి?

గబగబ, బైటకెళ్ళాడు రవిప్రకాశం. డ్రైవర్‌ని కారు తీసుకుని ఇంటికి వెళ్ళమన్నాడు. తాను, వొక్కడూ నడుచుకుంటూ వెళ్లాడు.

ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. మేఘాలు పైకి వెళ్ళలేక, భూమి అంచుల్ని పట్టుగుని పాకుతున్నాయి రోడ్డుమీద దీపాలమధ్య చీకటి, నిద్రనుంచి లేచిన దానికిమల్లే ఎర్రటికన్ను మీటుతోంది. మనుషులు నడుస్తున్నారు. అస్థిపంజరాలు—ఉద్రేకంతో, అన్వేషణతో, వాంఛతో, అహంతో కదిలే అస్థిపంజరాలు—మెల్లగా నడవడంలో ఏదో ఆనందం పొందుతున్నాడు రవి.

నరసయ్య మేడదగ్గరకు చేర్చేటప్పటికి తొమ్మిదైంది. గేటు దాటాడు. వరండాలో కొచ్చాడు. పనివాడున్నాడు.

"అయ్యగారింకా రాలేదండి—మీటింగండి" అన్నాడు,

"తెలుసు" అన్నాడు రవి

"అల్లా కూకోండి—మంచి తీర్థం తెప్పించేదాండి—వంటాయనతో సెప్పి"

"వొద్దులే."

"నడిసొచ్చారేంటండి........?"

"ఆ-ఏమిటి?"

"కారులేదాండి?"

"ఓ. అదా. రిపేర్‌కెళ్ళిందిలే."

"ఇంకనుండి రంజిత్‌గారేనంటండి పెద్దయ్య-కంపెనీలో— గంగాధరంగారు కలకత్తా పోతుండారుగా" అన్నాడు.

"ఓ—అల్లాగా........"

పదవుతోంది. పనివాడు గేట్ తీశాడు. కార్లోంచి దిగాడు నరసయ్య.

"ఎవరది—రవా?" అన్నాడు నరసయ్య.

లోపలికెళ్ళాడు.

"రంజిత్ మాధవిని చేసుకుంటాడుట. తన కభ్యంతరం లేదన్నాడు గంగాధరం" అన్నాడు నరసయ్య.

"మంచిదే"

"ఇంక ఆ పిల్లని కూడా, ఆ కంపెనీలో జేర్పిస్తే నయం, ఏం?"

"మరీ మంచిదే"

"సమస్య తీరిపోయింది—అదిసరేగాని ఏం ఇట్లా వొచ్చావు?"

"మీతో చెప్దామని—అదే. ఆ లైసెన్స్‌పోయింది. నేనే పారేశాను. రేపు అరువేలూ కట్టేస్తాను." అన్నాడు రవి.

"అట్టచెప్పు. ఏంటబ్బా సరుకురాదు అనుకుంటున్నా. మతిమరుపుగా మాసు-ఆ బొంబాయి పట్నంపోతే, అంతే. నాకూ వోపాలి అట్టాగెందిలె.... దబ్బు కడితే పేచీ ఉండదుగా....ఏముందిలే—జీతంలో పట్టొచ్చుగా...." అని సముదాయింపు మాటలు గొణిగాడు నరసయ్య.

శెలవు తీసుకొని బైలుదేరాడు. నాకార్లో వెళ్ళమన్నాడు నరసయ్య. కారులో ఇంటికెళ్ళాడు రవిప్రకాశం. ఇంత పొద్దు పోయిందేం అంటూ భార్య కమలమ్మ పలకరించి, లోపలికి తీసి కెళ్ళింది. మంచినీళ్ళిచ్చింది!

"ఇదుగో కవరు. ఇందాక వొచ్చింది." అన్నది భార్య. కవరుచించి చదివాడు. అది స్నేహితుడు వ్రాసింది. చిత్రకళా ప్రదర్శనలో తన "చీర మడతలు" ప్రతిమని ఉత్తమమైందిగా ఎన్నికచేశారనీ, అయినా, ఏకారణం వల్లనో బహుమతి ప్రకటించలేదనీ వ్రాశాడు. ఆశ్చర్యపడ్డాడు రవిప్రకాశం. జేబురుమాలుకోసం జేబులో చెయ్యిపెట్టాడు. రుమాలుతో రెండు స్టైయిన్

లెస్‌స్టీల్ మరమేకులు కూడా పైకితీశాడు. ఆనాడు నరసయ్య చూపించిన శాంపిల్ మరమేకులు—గంగాధరం కంపెనీకి చేయించినవి-మరిచిపోయి, తన జేబులో పెట్టుగున్నవి. వాటిని అరచేతిలో పెట్టిచూస్తున్నాడు. భోజనం ఏర్పాట్లకి లోనికెళ్ళింది భార్య. బహుమానం రాకపోయినా తన శిల్పం ఉత్తమమైందిగా ఎన్నికైనందుకు ఒక్కక్షణం, ఆనందంతో ఊగిపోయింది అతని మనస్సు. బహుమతి ఎందుకు ప్రకటించలేదో కారణం, ఊహించగలడు తను. తానిక్కడ కంపెనీ వ్యవహారంలో ఏదో నేరంచేశాడనీ, అందుకు చర్య తీసుకుంటున్నారనీ, గంగాధరం తాలూకు మనుషులెవరో ప్రచారం చేసివుండాలి. ఆ ప్రచారం, చిత్రకళా ప్రదర్శన జడ్జీలకి కూడా తెలిసివుండాలి. అందుకని వారు తమ నిర్ణయం ప్రకారం, బహుమానం ఇవ్వక, విలిపివేసివుండాలి. అంతేనా మనుషులు! కళారంగంలో కూడా ఇంతటి నిజాయితీ ఏనా?

అయినా, విచారంలేదు. కారుణ్యంలో వొక ఆనందం వుంది. ఆనాడు ఆ శిఖరాలనడుమ, ఆ చెట్లమధ్య, ఆ నీడల్లో ఆ సరస్సులో దర్శించిన అనుభూతి, ప్రతిమ కూర్చడంలో ఆవహించిన ఆనందం వొక్క కన్నీటి బిందువుగా జారి, చేతిలో మరమేకుల్ని తడిపింది—కన్నీటికితడిసి తుప్పు పట్టని మరమేకులు!

ప్రచురణకాలం : 196౮ ఫిబ్రవరి 3-8

ప్రచురణ : ఆంధ్రపత్రిక పరాభవ ఉగాది సంచిక 1966-67